పశ్చాత్తాపము

కురుమెళ్ల వేంకటరావు.

పశ్చాత్తాపము

కురుమెళ్ల వేంకటరావు

ఉపాధ్యాయుఁడు

శ్రీరాజా రావు భావయమ్మారావు హైస్కూలు

పి ఠా పు ర

Approved by the Director of Public Instruction.
Vide Fort St.George Gazette D/ 15-11-1932, Page 632.

రెండవ కూర్పు.

1935

[వెల రు. 0-6-0

"Brother ! !

There is nothing more beautiful in the world than a truly repented soul.

To know this is to know ourselves and our God."

T.P.

FOREWORD

This book contains seven interesting stories written in simple style. It may be used a non-detailed text book in Telugu for the lower forms. The author is a promising young teacher deservin all help and encouragement.

R.R.BH.R.HIGH SCHOOL,
PITHAPURAM,
25-7-1934.

N.RANGACHARY,
M.A.,L.T.,
Head-Master,

శ్రీ రామా!

I have read the booklet written by Mr. Kurumella Venkatarao containing seven short stories illustrating the efficacy and sacredness of true repentance. They are well written in simple Grandhic Telugu. We ordinarily find in many books of the kind stale old tales appearing in different garbs. But Mr. Venkatarao relieves school children of that sort of monotony by selecting for his book fresh stories of both Indian and non-Indian origin. I heartily recommend the young writer for departmental encouragement.

PITHAPURAM,
15—11—1935.

K. NARASIMHAM,
Retired Headmaster,
R. R. BH. R. High School.

మున్నుడి.

మానవజీవితము కలుష దుర్బలము. పాపము లొనరించుట దానికి స్వాభావసిద్ధము. లోభమో, మోహమో చెలరేఁగి దాని నుజ్జ్వలత లూఁపివేయును. ఒక దుష్కృత్యమనక, యొక హింసాకర్మ మనక, యొక రక్తపాత మనక, మానవుఁడు లోభమోహావిష్టుఁడై, యున్మత్తుఁడై చేసివేయును. కోరికలతోఁ దల్లడిల్లుచుండును. క్రోధముచే మండిపోవుచుండును. మదముచే జిఱ్ఱుఁదిరిగిపోవును. ఇట్టి యవస్థలో భగవత్కటాక్షలేశమున హృదయమున నెచ్చటనో యొక జ్యోతి తళుక్కు మనును. తోడనే కన్నులువిప్పి వెనుదిరిగి చూచుసరికి తన భయంకరఘాతుకకృత్యములు, హింసలు, ననంతపాపములును దమ కరాళజిహ్వల నప్పళించుచు మ్రింగఁ జూచునట్లగపడును. మానవుఁడా భయదదృశ్యమును జూడ లేక భయకంపితుఁడై కన్నులుమూసికొని పతితపావనుఁడగు భగవంతుని బ్రార్థించును. ఆపరిశుద్ధాత్మ కన్నులవెంటఁ బవిత్రములగు నుష్ణాశ్రువులు జాలువాఱును. అదియే పశ్చాత్తాపము.

ఆ యమృతాశ్రుమాధుర్యము నెఱిఁగిన వారు మహితానుభావులగు జీజస్, బుద్ధుఁడు మొదలగువారు. వారు "పతితులను జూడరాదు, వెలిపెట్టవలె" నను మొఱకు సిద్ధాంతముల వారు కారు. "పాపములు మానవసాధారణములు. పశ్చాత్తప్త

లగు పతితుల నుద్ధరించుటయే ప్రేమమూర్తియగు భగవంతుని కిష్టము''ని నమ్మిన విశాలహృదయులు. వీ రిట్లెందఱనో పాపాత్ముల నుద్ధరించిరి. దానికిఁ దార్కాణ మీకథాగుచ్ఛక మందలి 'పాపిని—జీజస్,' 'అహింసకుఁడు—బుద్ధుఁడు' ను, నను కథాద్వితయము.

చూడుఁడు. జీజస్ పాపినితో నే మనుచున్నాఁడో "నేను మాత్రి ఘోరములకు నిందింతును! నీవు పశ్చాత్తాప మొందితివి. కావున పాపము లెల్ల నశించినవి. పొమ్ము. ఇఁక నెన్నఁడును బాప మొనరింపకుము". వేయిమంది యనపరాధులఁ జంపి తద్రక్తములోఁ బొరలాడిన పాపపంకిలుఁ డగు నహింసకుని "గౌతమబుద్ధుఁడు లేవ నెత్తినాఁడు. కౌఁగిటఁ జేర్చుకొన్నాఁడు". అట్టి పతితపావనుఁ డగు బుద్ధభగవానుని వలనఁ "బరమక్రూరుఁడైన నరహంత యిప్పుడు పరమసాధుభిక్షుకుఁ డైనాఁడు." కావున నిజముగఁ బశ్చాత్తాప మొందిన నిర్మలాత్మకంటెఁ బవిత్రమైన వస్తు వింకొకటి లే దని చెప్పవచ్చును. పాపము లొనరించినందుల కంతగా భగవంతుఁడు కోపింపఁడు. కాని పాప మొనరించి పశ్చాత్తాప మొందని పరమకలుషాత్ముని నెన్నఁడు క్షమింపనేరఁడు.

పశ్చాత్తాప మందలి పరమార్థమును గుర్తించి యీ గ్రంథకర్త యెద్దురు పశ్చాత్తప్తుల పవిత్రకథలను జక్కఁగా రచించెను. అందు "అహింసకుఁడు—బుద్ధుఁడు, చిన్నకొడుకు—తండ్రి, వాల్మీకి—బాలిక, అశోకుఁడు—యుద్ధభూమి" అను కథలు కడు రసవంతములై యొప్పారుచున్నవి. వాల్మీకికథ యూఁగళ్లు పాశాలుగాఁ జెప్పికొనువిధముగాఁ గాక యిందు

రూపొందినది. ఒకరియుపదేశముకంటె స్వపశ్చాత్తాపమే మానవుని పవిత్రునిజేయు నని కాఁబోలు మార్చుటలోని యాశయము. తత్తద్రసానుగుణమైన భాషయు భావములును నిండు సమంజసముగ నెలకొనినవి.


బాలురకు శాస్త్రమనిన నెంతకష్టమో కథ లనిన నంత యిష్టము. కనుక వారికిష్టమగు పథమున మన ముపదేశింప వలసిననీతులను, నహింస, సత్యము మొదలగు సద్గుణములను బోధించి వారి లేఁతమనస్సున నాటుకొను నట్లుచేయుటమంచిది. తమ యధ్యాపనానుభవమున నీవిషయమును గమనించి బాలురరుచి ననుసరించి సుబోధముగ నస్మన్మిత్త్రులగు వేంకట రావుగారీ కథాగుచ్ఛకము నుపనిబద్ధించిరి. కథలలో బాలురకుఁ గావలసిన విజ్ఞానమును గలిపి వారిహృదయములవికసింపఁ జేయుట వీరిముఖ్యోద్దేశము. కావుటంబట్టియే వీ రింతకుమున్ను రెండు కథానకపుస్తకములఁ బ్రకటించిరి. నేఁడు మఱియొక కథాగుచ్ఛమును నాంధ్రబాలుర కందించి వారి విద్యావికాసమున కెంతయుఁ దోడ్పడుట ప్రశంస్యము.

మఱియుఁ గథాగుచ్ఛకాంతరములకంటె వీరి యీగుచ్ఛమునకొక విశేషముకలదు. ఎంతసేపును మనవారు పాడినదేపాడి విసువు పుట్టించి బాలురను విముఖులఁ జేయుదురు. వేంకట రావుగారు క్రొత్తకథల నిందుఁ బొందుపఱచి పిల్లల సుముఖులఁ జేసికొనిరి. దీనిని మంచిమనసుతోఁ బరికించి బాలుర కుపయోగింపఁ జేసినచో నీ కృతికర్త కృతకృత్యుఁడగును.

రాజమహేంద్రవరము,
౨౯-౭-౧౯౩౭.

ఉభయభాషాప్రవీణ
ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి.

కథలు.



"తీవ్వసఁ గొమరునివైపు పరుగెత్తెను. రెండుచేతుల నతనికై చాఁచెను. గాఢముగఁ గౌఁగిలించుకొని..."

పుట. 5

పశ్చాత్తాపము

చిన్నకొడుకు—తండ్రి

౧

ఒకధనికున కిరువురు కొడుకులు కలరు. వారల నిద్దఱు నాధనికుఁ డొక్క తీరునఁ బ్రేమించుచుండెను. ఆయిరువురలో రెండవవాఁడు మిక్కిలి దురుసుఁదనముఁ గలవాఁడు. ఆతఁ డొక దినమునఁ దొందరపడి తండ్రియొద్ద కేఁగి "తండ్రీ! నేను బాల్యమును గడచి పెద్దవాఁడ నైతిని. కావున మనయాస్తిలో నాకుఁ రాఁదగిన భాగమును నాకుఁ బంచియిమ్ము" ని నిర్బంధించి యడిగెను.

తండ్రి చాల దయగలవాఁడు. కొమరునికోరిక నిరాకరింపక వెంటనే యాతనిభాగముఁ బంచి యిచ్చివేసెను. కుమారుఁ డాధనమంతయుఁ దనవశముఁ జేసికొనెను. పిమ్మట నతనికా యూర నుండుట కిష్టము లేక దూరదేశమున కేఁగి యచ్చట స్వేచ్ఛగా సంచరింప వలయునని యెంచి మఱియొక యూరికిఁ బ్రయాణ మయ్యెను.

తనవంతువచ్చిన సొత్తంతయు నాతఁడు తనవెంటఁ గొనిపోయినాఁడు. అచ్చట విచ్చలవిడిగాఁ జరింప మొదలుపెట్టినాఁడు. ధనికుఁ డగు నాయువకుఁ డొంటరిగఁ బరదేశమున నుండుట తటస్థించినపు డెట్లు ప్రవర్తించునో వేఱె చెప్పవలయునా ? దుర్జనసహవాసముఁ జేసినాఁడు. పరస్త్రీల వెంటఁబడినాఁడు. త్రాగుఁబోతయి ధనమంతయు వ్యయ మొనర్చి నిఱుపేద యైనాఁడు.

చేతిలోనిసొమ్మంతయుఁ జెల్లిపోయెను. తినుట కన్నముఁ గట్టుకొనుటకు గుడ్డయు లేక మిక్కిలి హీనదశ నొంది యేమి చేయుటకును దోఁచక పిచ్చివానివలెఁ దిరిగితిరిగి సేవకవృత్తి చేసియైనఁ బొట్టఁ బోషించుకొనవలయు నని యెంచి తుద కొక సేద్యగానియొద్దఁ గొలువు సేయుటకుఁ గుదిరెను. ఆకృషికుఁడు తనయొద్దనున్న పందులగుంపును గాయుటకై యాతని నియమించెను.

పాపము, ఆగర్భశ్రీమంతుఁడు పందులకాపరి యయ్యెను. భోజనమా కడుపునిండ లేదు. పందులతోఁ బాటూఁకయుఁ బొట్టునైనఁ దిని బ్రదుకవచ్చునని యతఁడు తలఁచెను కాని యదిమాత్ర మాతని కెట్లు లభింపఁగలదు ?

అతఁడు పందులను గాయుచు నొడలినిండ బట్టయైన లేక చినిఁగినపీలికలు గట్టుకొనియుండెను. చేయునది నీచమైన పని. [illegible] మిక్కిలి [illegible] కడుపునిండఁ [illegible]

లేదు. పటులమఱల నధికారికిం గనంబడి తనదరిద్రస్థితిం జెప్పుకొనుట కభిమానము. ఆంకలిబాధ భరింప శక్యము గాకుండెను. ఒడలికి స్నానసంస్కారము లేవియు లేవు. తలయంతయుం జిక్కువడిపోయెను. మిక్కిలి రోగపీడితుండయి శల్యావశిష్టుండయ్యెను. వెనుకటి కళకాంతు లెక్కడికేంగెనో కానరావు.

ఆతం డొకదినమునం బందులయెదుట గూర్చుండియుండి తనదుస్థితి కెంతయు వగచుచుం బూర్వవృత్తాంతము జ్ఞప్తికిం దెచ్చుకొనుచుండ నంతలో నాతనిమనసులోం దటుక్కున నొక్క మెఱపు మెఱసెను. తా నెవండో, తనగ్రామమేదియో. తా నిట్లగుటకుం గారణమేదియో యని యాలోచించునప్పటి కింకొక మెఱపు మెఱసెను. అతనిహృదయమున నాశయు ముఖమునం గాంతివికాసములును బొడసూపినవి.

"అహో! నాతండ్రి యెంతమంచివాండు. నన్నపరిమితముగం బ్రేమించినాండే! మాగృహవైభవము లెన్నంటికైన మఱవం దగునే? ఎడతెఱపిలేని నిత్యోత్సవములు గన్నులం దనుపుచుండెడివిగదా! నాతండ్రియొద్ద నెందఱో పనిసేయుచు సర్వకాలసర్వావస్థలయందును సుఖముగం గాలక్షేపముం జేయుచుందురు. వారలు కడుపునిండ భుక్తియు నొడలినిండ వస్త్రములునుగలిగి యితరులకుంగూడసమృద్ధిగం బెట్టంగలుగుచున్నారు. అకటా! నేనిచ్చట నాంకలిచే జావనేల? ఈక్షణమందే నా తండ్రియొద్దకుం బోయెదంగాక. ఆతండు కరుణార్ద్రహృదయు.

డు. నన్నాదరింపకపోఁడు. ఆతనియొద్ద కేఁగి 'తండ్రీ! నేను నీయెడలను భగవంతునియెడలను గొప్ప యపచారము నొనరించితిని. నేను నీకొడుకు ననిపించుకొనుటకుఁ గూడఁ దగినవాఁడను. నే నొనరించినతప్పిదము నీవు క్షమించుటకు పలుకొనది. కావున నే నొకటి కోరెదను. నీకడ నెన్నియో వందలమంది జనులు కొలువు సేయుచున్నారుగదా! వారిలో నొక్కనికి నీ విచ్చునంతజీతము నా కిచ్చి నన్నొకపనిలో నియోగింపుము' అని ప్రార్థించినయెడల నిరాకరింపఁడు."

ఇట్లూహించుకొనునప్పటి కాతని మనసులో నొక క్రొత్తయానంద ముదయించెను. కాలుసేతులలో మున్నెన్నఁడునులేనిబలము కలిగెను. దిగ్గున లేచెను. ఎవ్వరితోడను నేమియుఁ బలుకలేదు. తనభావిసుఖములను మననముఁ జేసికొనుచు వడివడిగఁ దనదేశమువైపు నడచెను. అనతికాలములోనే తన యూరుఁ జేరుకొనెను. మెల్లగాఁ దనతండ్రియున్న ప్రాంతమున కేఁగెను.

౨

తండ్రి యాతని దూరముననే కాంచెను. ఆతఁ డెంత మారురూపుఁ బొందియున్నను కుమారుఁడని వెంటనే గ్రహించెను. ఆతనిమనసున నాత్రము జనించెను. కొడుకునందలి ప్రేమాతిశయమున నాతనిశరీరము కంపించెను. కన్నులనుండి

సానందాశ్రువులు రాలెను. రివ్వునఁ గొడుకునివైపు బరుగె [illegible] రెండుచేతుల నతనికై చాఁచెను. గాటముగఁ గౌఁగి [illegible]ంచుకొని, యాతనిమూర్ధ మాఘ్రాణించి ముద్దిడుకొనియెను.

కొడుకు "నాయనా! నేను భగవంతునియెడలను నీయెడలను ఘోరతమమగుపాప మొనరించియుంటిని. నీకుమారుఁడ ననిపించుకొనుట కిఁక నాకు యోగ్యత లేదు. నన్ను క్షమింపకు మ" ని బిగ్గఱగ నఱచెను.

తండ్రి, సేవకులను బిలిచి "ఈతఁడు నాప్రియసుతుఁడు. కొన్నిదినములక్రిందట నీతఁడు చనిపోయి మఱల నిప్పుడు బ్రదికి వచ్చినాఁడు. చేయిజాఱి యగాధసముద్రమునఁ బడిన యీ నాతనయుఁడు నాయదృష్టమునఁ దిరిగి నాకు లభించినాఁడు. మీరు వెంటనే విలువగలబట్టలను దీసికొనివచ్చి యీతనికిఁ గట్టనిండు. అమూల్యములైన యాభరణముల నీతనికిఁ దొడుగుఁడు. మంచిపాదరక్షల నీతని కొసఁగుఁడ" ని యాజ్ఞాపించెను. అతఁ డత్యంతసంతోషమున బంధుమిత్రుల నందఱను రావించి విం దొనరింపసాగెను.

ఇంతలోఁ బెద్దకొడుకు పొలములోనుండి గృహాభిముఖుఁడై చనుదెంచి తమయింట జరగుచున్న సంగీతములు, నృత్యములు, విందులు. మొదలగువైభవము లన్నియుఁ జూచి మిక్కిలి విస్మితుఁడై యాసమీపమునఁగల సేవకు నొక్కనిఁ బిలిచి "యిచ్చటికోలాహల మేమ" ని యడిగెను.

"కొంతకాలముక్రిందట మిమ్ము విడనాడిపోయిననీసో దరుఁ డిప్పుడు సురక్షితముగ నింటి కేతెంచినాఁడు. అందుల కై మీతండ్రి మనయూరనున్న పెద్దల కందఱకు విందొనరిం చుచున్నాఁడ" ని సేవకుఁడు పలికెను.

ఈమాటలు వినునప్పటికిఁ బెద్దకొడుకున కెంతయుఁ గోపము వచ్చినది. అతఁ డింటిలోనికిఁ బోవుట కిష్టపడలేదు. బయటనే నిలువఁబడి యుండెను. తండ్రి కాసంగతి తెలియ వచ్చినది. వెంటనే యాతఁ డీవలి [illegible] వచ్చెను. కొమారుని లో నికి రమ్మని బతిమాలెను. [illegible] కొడుకు [illegible] కోపముతో నిట్లు పలికెను.

"ఇన్నినాళ్ళ [illegible] నేను [illegible] డును నేను నీ [illegible] లేదు. నీమనసున [illegible] కష్టము [illegible] కలిగించియుండ లేదు. నీయాజ్ఞ [illegible] బరిపాలించితిని. ఇట్లుచేసినను నాకిష్ట [illegible], [illegible]యైన విట్టియుత్సవముఁ జేయింప నెంచితివా? నిన్ను రచ్చకెక్కించి నీయింటిగుట్టు బయటఁబెట్టి త్రాగుఁబోతయి నీయాస్తిని వేశ్యల కర్పించిన యీ నీచిన్నకొడుకు వచ్చినతోడనే యింతయార్భాటముఁ గావించుచుంటివే. ఇన్ని భక్ష్యములను జేయించితివే. ఇన్ని యుత్సవముల జరపించుచుంటివే" అని మహాక్రోధమునఁ బలుక ధనికుఁ డామాటలు విని "నాయనా, నీ వెల్లప్పుడును నాకడనే

యున్నాఁడవు. నాకుఁగల యాస్తి యంతయు నీదేకదా! వెడలిపోయినసోదరుఁడు మన కిఁక లేఁ డనుకొనినవాఁ డిప్పుడు తిరిగి లభియించినాఁ డనఁగ మనమనముల కెంతయు సంతోషముదయింపకుండునా? దీని కనువగు నొక్క తార్కాణముఁ జెప్పెద నాలింపు" మని యిట్లు చెప్పఁ దొడఁగెను.

మహాత్ముఁ డగు జీసస్ గొల్లవారియింటఁ బుట్టెను. అతఁడు పాపులను దనచెంతకుఁ జేర్చుకొని కాపాడినాఁడు. అతఁ డిట్లు పాపుల రక్షించుచున్నందుల కతనిపై ఫారిసీలు మున్నగువారల కెంతయుఁ గోపము వచ్చినది. వారలు మొగములు చిట్లించుకొనినారు. పాపాత్ముల కాతఁ డాశ్రయ మిచ్చి వారితోఁ గలిసి భుజియించునని యాతని మిక్కిలి నిందించినారు. జీసస్ వారి కిట్లు సమాధానముఁ జెప్పినాఁడు. "అయ్యలారా! మీరు నాపైఁ గినియక మన్నించి నావిన్నప మాలింప వేఁడెదను. ఒక గొల్లవానికి నూఱుగొఱ్ఱె లున్నవి. వానిలో నొకగొఱ్ఱె తప్పిపోయెను. గొల్లవాఁడు తక్కినతొంబదితొమ్మిది గొఱ్ఱెల నాయడవిలో విడిచి తప్పిపోయిన యొక్కగొఱ్ఱెకై తిరుగక మానఁడు [illegible] గొఱ్ఱె [illegible]నికి దొఱకినప్పు డెంత యానందించునో వచింప శక్యము [illegible]? మ[illegible]నుండి విడిపోవని తొంబదితొమ్మిది గొఱ్ఱె[illegible] [illegible]టిసంతోషము [illegible] తప్పిపోయిన యా[illegible] [illegible]భించునప్పుడు కలిగెడి యానంద మా[illegible]కి [illegible] [illegible]కదా?

అతఁడు దానిని దనభుజముపై నెక్కించుకొనును. మహాదానం దమున నింటికిఁ దిరిగివచ్చి పోయినగొఱ్ఱె మఱల దొరకినదని గంతు లిడుచుఁ దనయానందమునఁ దోడివారలనుగూడఁ బాల్గొనఁ జేయును.

సర్వరక్షకుఁడైన భగవంతుని యిచ్ఛ యదియే. సృష్టి యందలి యేవ్యక్తియును నశింపఁగూడదు.

పశ్చాత్తప్తుఁడైన పతితునిగూర్చి దేవుఁ డపరిమితానంద మొందును.

పశ్చాత్తప్తుఁడగు నొక్కని భగవంతుఁ డతిప్రేమతోఁ దనహృదయమున కాదుకొనును. తక్కినతొంబదితొమ్మండు గురలోఁ బశ్చాత్తాపములేదు కావున వా రాతని కంతగాఁ బ్రేమపాత్రులు కాలేరు.

ఇదియునుఁగాక యింకొక విశేషము. ఒక తెకుఁ బది వెండినాణెములున్నవి. వానిలో నొకటి యామెచేతినుండి జాఱి పోయినది. మిగిలిన తొమ్మిదింటితో నామె తృప్తిఁ జెంది యూఱకుండదు. పెద్దదీపమునొకదానిని వెలిఁగించి వాకిలియంతయు వెదకివెదకి దాని నామె గ్రహించి యానందించును. పోయినవస్తువులోనివిలువ యామెకుఁ దెలియును. పతితుఁడై పశ్చాత్తప్తుఁడైనయాతనికై భగవంతుఁడటులనే సంతసించును" అనియిట్లు జీసస్ వచించి తనవ్యతిరేకుల హృదయములను గరఁగించినాఁడు.

కావున నోతనయా ! నీయనుజుఁ డిట్లే పశ్చాత్తప్తుఁడై తిరిగి చనుదెంచినాఁడు. వానిపాపము లన్నియుఁ బటాపంచలైనవి. నీ విఁక వానిపై దయఁ జూపుట కర్తవ్యము ” అని బోధించి యాతనికోప ముడిపి లోనికిఁ గొనిపోయి తమ్ముని యొద్దకుఁ జేర్చెను.

చిన్నవాఁ డన్నను గాంచి ‘ అన్నా! కన్నుఁ గానక నే నెన్నియో పాపకార్యము లొనరించి తుద కిప్పుడు పశ్చాత్తప్తుఁడ నయితిని. కావున దయతో నన్ను మన్నింపవలయు ’ నని కన్నీటిధారలచే నన్నగారి పాదములఁ దడిపి యాతని మన్ననలకుఁ బాత్రుఁ డయ్యెను.

బాలుఁడు-దాది.

౧

ఒకదినమున నొకపట్టణపురాజవీధినుండి యొకఁ డొక గుఱ్ఱపుబండిని మెల్లగఁ దోలుకొనిపోవుచుండెను. అం దొక దొరసాని కూర్చుండియుండెను. ఆమె తెల్లనిదుస్తులను ధరించి యుండెను. ఆమెతలపై నొకతెల్లనిగుడ్డటోపి యుండెను. బండి యొకసందుచివరకు వచ్చుసరి కొకప్రక్కనుండి శరవేగమున నొకఱాయి వచ్చి యాదొరసానినుదుటిపైఁ బటుక్కునఁ దగిలెను. చుట్టుపట్టుల నెవ్వరును గాన్పింపరు. ఎనిమిదేండ్లబాలుఁ డొక్కఁడు మాత్ర మొకరాళ్లగుట్టయొద్దనుండి ప్రక్కసందు లోనికిఁ బరుగెత్తుకొనిపోవుచుండెను. చూచునంతలో నాతఁడు సందులో మాయమైపోయెను.

పాపము. దొరసానిముఖముపైఁ బెద్ద గాయమైనది. ఆగాయమునుండి జిలజిల రక్తము కాఱఁజొచ్చెను. ఆమె ధరించిన స్వచ్ఛమగువస్త్రములు రక్తముచేఁ దడిసిపోవుచుండెను. దెబ్బతగిలినతావున నామె చేతితో గట్టిగ నొక్కి పట్టుకొని యుండెను. ఆమె తల తిరుగుచుండుటచేతఁ గాఁబోలును బండికిఁ జేరవ్రై చినది. బండివాఁడు బండిని నిలిపి క్రిందికి దిగివచ్చి 'అమ్మా! ఇప్పు డాప్రక్కకుఁ బరుగెత్తుకొనిపోయినకొంటె పిల్లవాఁడే నిన్నుఁ గొట్టియుండవచ్చును. వాని నొక్కనిముస

ములోఁ బట్టుకొని నీయొద్దకుఁ దీసికొని వచ్చెదను. నీ విచ్చట జాగ్రత్తగ నుండుము" అని యాతఁడు పోఁబోవుచుండెను.

"వలదు. వల"దని యామె యాతని వారించి "బండి నెక్కి త్వరితముగఁ దోలు" మని యాతని కాజ్ఞాపించెను. బండివాఁ డేమియుఁ జేయలేక బండిని దోలుట కారంభించెను.

ఆబాలకుఁ డీమె నెందులకుఁ గొట్టియుండును? ఈమె యాతని కదివఱ కెన్నఁడైన నేమైన నపకార మొనరించి యుండునా? అట్లు జరిగియుండదు. తన కింతటిపెద్దగాయ మొనరించిన యాతఁ డెవఁడయి యుండునో తెలిసికొనుటకైన నిష్టపడనిమంచిహృదయముగలయామె యాతని కె ట్లపకార మొనరించియుండును? దారిని బోవుచుఁ బ్రక్కనున్న పసిపాపలను, గుక్కలు, దూడలు మున్నగువానిని నాగడమునఁ గొట్టుచుఁ బోవు బాలు రెందఱు లేరు? అటులే యాబాలుఁడును, వింత దుస్తులను ధరించి బండిలోఁ గూరుచుండిన దొరసానిపైఁ గారణము లేకయే ఱాతిని విసరియుండవచ్చును.

౨

కొన్ని దినములు గడచిపోయినవి. పల్లెజలదురద్రృష్టవశమున నొకప్పు డాయూర గొప్ప మశూచిరోగము సంభవించెను. దానివలన నెందఱో జనులు పురుగునాకినవిధమునఁ జచ్చిపోవుచుండిరి. గ్రామమం దంతటను మిక్కిలి భయంకరముగ

నుండెను. "రోగగ్రస్తు లూరివెలుపలకుఁ బోయి యుండవల యు" ననియు "లేకున్న శిక్షింపఁబడుదు" రనియు దొర తనమువారు ప్రకటించి రోగవ్యాప్తి నాఁపుటకై తగినప్రయ త్నములఁ జేయించుచుండిరి. చాలమంది జనులు రోగుల నెందఱనో యూరివెలుపలకుఁ దీసికొనిపోయి యచ్చట వారిని సంరక్షించుచుండిరి.

ఒకదినమున నొకచెట్టుక్రింది కొకకుటుంబము చేరెను. నలువురుబిడ్డలుఁ దల్లియుఁ దండ్రియు నం దుండిరి. తల్లి పెద్ద కొడుకు నొడిలోఁ బెట్టుకొని కూర్చుండియుండెను. ఆబాలుఁడు సుమా రెనిమిదేండ్లప్రాయమువాఁడు. ఆతనికి మశూచిరోగము సంభవించినది. ఆతనియొడలంతయు మశూచికపుఁ గుండలచేఁ గాలిపోయి నీరుపట్టిన ట్లుండెను. ఆతనినోటియందుఁ గన్నుల లోనుగూడ మశూచికపుఁగుండ లుండుటచే నీరుఁ ద్రాగుట కైనఁ జూచుటకైన వీలులేనంతటియవస్థయం దుండెను. అట్టి దుర్భరదృశ్య మాతని తలిదండ్రు లెన్నఁడును గనియెఱుంగరు. బాలుఁ డిఁకఁ బ్రదుకుననెడియాశ వారల కెంతమాత్రము లేనందున నాతని నింట నుండి యిటకుఁ గొనివచ్చిరి. తక్కిన బిడ్డల నింట నునిచివచ్చినచో వారిని గాపాడువా రెవరును లేరని వారినిగూడఁ దమవెంటనె కొనివచ్చిరి.

ఇచ్చటఁ బెద్దకొడుకునకుఁ గ్రమముగ వ్యాధి హెచ్చు గుటచేఁ దలిదండ్రులు తక్కినవారి నిఁక నిట నుండనిచ్చినచో

నెటుపోయి యెటువచ్చునోయని యెంచి వారి నింకొకచోటికిఁ గొనిపోవుటకు నిశ్చయించుకొనిరి. కాని, కని పెంచి పెద్దవానినిజేసిన తమతనయుఁ డింతటిదుస్స్థితిలో నున్నప్పుడు విడనాడ నెంచునంతటి కఠినహృదయు లగు తల్లిదండ్రు లెందైన నుందురా? వారలు తనయుని విడనాడ సాహసింపరైరి. చేతులార నాతనికిఁ జికిత్సలను జేయఁజాలరైరి. కంటికి మంటికి నొక్కటేధారగ నేడువఁ దొడఁగిరి.

కష్టసమయములయం దీశ్వరుఁడు ప్రత్యక్ష మగుచుండును. ఆయూరిచివర నొక చికిత్సాగార ముండెను. మతప్రచారకసభవా రాయాసుపత్రిని నడుపుచుండిరి. దయాంతరంగులగు నా మిషనరీవా రందఱిరోగులను గ్రహించి యా చికిత్సాగారమునకుఁ గొనిపోయి యుచితవైద్య మొనరించి సంరక్షించుచుండిరి. భగవత్కృపవలన నా వైద్యులు వీర లున్నస్థలమున కరుదెంచిరి. వెంటనే తలిదండ్రు లాబాలుని వారలయధీన మొనరించి తక్కినబిడ్డలతో స్వగృహమున కేఁగిరి.

ఒకదాది (Nurse) యాసుపత్రియం దా పిల్లవానిని సంరక్షించుట కేర్పడినది. ఆమె యాతని నొకనిమిషమైన విడిచి యుండక యాతనిపుండ్లయందలిచీము నొత్తిచి వైచి వేడినీళ్లతోఁ దుడిచినది. పుండ్లపై నొకవిధమగు చూర్ణమును జల్లి [illegible]

నది. ఆబాలుఁడు పండుకొనుటకుఁ బరిశుభ్రమైనపక్క నేర్ప
ఱచినది. పాలను, పండ్లరసమును, చిన్నగరిటెతో నాతని
నోటిలోఁ బోసినది. పాప మాదాది యిసుమంతయు విసుపక
తగ్గిసక్న వేయిరెట్లెక్కువప్రేమతో నాబాలున కుపచారము
లొనరించినది. క్రమముగ నాతనికి స్వస్థత కలుగఁజొచ్చెను.
ఘుండ్లు మాను మొగము పెట్టినవి. నోటిలోఁ బోసిన ద్రవపదా
ర్థములు నెమ్మదిగఁ గడుపులోనికిఁ బోవుచున్నవి. కొంచెము
కొంచె మాతనికి బలము కలుగుచున్నది. బాధలు తగ్గుచున్నవి.

పాప మా నర్సు బాలుని మంచముపైఁ గూరుచుండి
యాతనిచేతులు తనచేతులలో నుంచుకొని యుబుసుపోకకై
నేవేవోకథలను జెప్పుచుండెడిది. ఆకథల నాలించుచుండినంతసే
పా బాలుఁడు తనశరీరములోని బాధల నన్నిఁటిని మఱచిపోవు
చుండెడివాఁడు. కన్నులింకను విప్పుటకు వీలులేకుండుటచే
నతఁ డామెను గన్నులారఁ గాంచలేకుండెను.

ఇట్లు కొన్నిదినములు గడచినవి. ఒకనాఁటియుదయ
మున దయామయయగు నా దాది యాతనికిఁ జేయవలసిన
యుపచారము లన్నియుఁ జేసి యతనిపక్కను గూరుచుండి
యేవేవో మాటలఁ జెప్పుచుండెను. మెల్లగ నాబాలుఁడు తన
కనుఱెప్పల విప్పుటకుఁ బ్రయత్నించెను. కొంతవడికి ఱెప్పలం
కొంచెము పైకి లేచినవి. కాని యామెను జూచునంతటిదృష్టి
కలుగలేదు. ఆతఁడు తిరిగి నాఁటిసాయంకాలము కనుఱెప్పలఁ

కొంతవఱకు విప్పి చెంతనున్నదాదిని వీక్షింపఁగలిగెను. తోడనే పెద్ద నిట్టూర్పు విడిచి పక్కపై వ్రాలి మైమఱచి నిదుర వోయెను. మఱునాఁ డుదయముననే యాతఁడు మేల్కని తన కుపచారము లొనరించుదాదిని గన్నులారఁ గాంచెను. తోడనే యాతనికనుగొలుకులనుండి యశ్రుబిందువులు రాలెను. హృదయము దుఃఖపూరిత మయ్యెను. శరీరము వడవడ వణఁకఁ దొడఁగెను.

“ నాయనా! నాయనా! ఏల యిట్లు దుఃఖించెదవు? ఈశ్వరునిదయవలన నీ కిప్పుడు స్వస్థత కలుగుచున్నది. నీ విప్పు డేడ్చినచో నీకన్నులికఁ బనికిరాకుండఁబోఁగలవు. నీశరీరమును గంపింపఁ జేసినచోఁ దిరిగి జ్వరము రాఁగలదు. తండ్రీ! నీ కిప్పు డేమిబాధ కలిగినది? నే నెట్టిలోపమైన నీయెడలఁ గావింప లేదుగదా? దాఁపక నాతో యథార్థముఁ జెప్పుము.” అని యామె యాతని గడ్డముఁ బట్టుకొని బతిమాలినది. ఆతఁ డామెవంకఁ జూచి దుఃఖ మాఁపుకొనలేకుండెను. దాది యాతని యారోగ్యము తిరిగి చెడిపోవునేమో యని యత్యంతవిచార మొందుచు “ నాయనా! నీవు దుఃఖ మాఁపుకొని యథార్థముఁ జెప్పకున్న నాతోడే, నన్నుఁ జంపుకొనితినినట్లే.” యని యొట్టుఁ బెట్టెను.

పాప మాబాలుఁడు విధిలేక దుఃఖ మాఁపుకొన్నాఁడు. నోరు సవరించుకొన్నాఁడు. ఎండిపోయినపెదవుల నాలుకతోఁ

దడుపుకొన్నాఁడు. మెల్లగా "అమ్మా! నీముఖమునఁ బెద్ద మచ్చ యున్న దేమి?" అని యడిగి కంట నీర్వెట్టుకొన్నాఁడు. 'దెబ్బతగిలిన' దని యామె మెల్లగ సమాధానముఁ జెప్పెను. 'ఎప్పు డెప్పుడు? ఎట్లుతగిలిన' దని మఱల నాతఁ డేడ్చుచు నడిగెను.

"ఎట్లు తగిలినదో నాకుఁ దెలియదు. నే నొకదినమున బండిపై నెక్కి రాజమార్గమునఁ బోవుచుండ నొక్కయెడ నాకస్మికముగ నొక ఱాయి వచ్చి నా నుదుటిపైఁ దగిలినది. నే నెంతయు బాధ నొంది వెంటనే కట్టుఁ గట్టుకొంటిని. గాయము చాలదినములవఱకు మానలేదు" అని యామె మఱల వచించెను.

ఈమాటలు వినినతోడనే యాబాలుఁడు కెవ్వుమని కేక వైచినాఁడు. ఆతనిశరీర మంతటను చెమటలు పట్టినవి. "అమ్మా! బాల్యచాపల్యమున నాఁడు నిన్ను గొట్టిన దుర్మార్గుఁడను నేనే, నా కీశ్వరుఁడు విధించిన యాశిక్ష చాలదు. దయామయవగు నిన్ను నిష్కారణముగఁ గొట్టి నొప్పించిన యీదుష్టుని, తల్లిదండ్రులచేఁ గూడ బహిష్కరింపఁబడిన యీనిర్భాగ్యుని నీవు భగవంతునివలె రక్షించి బ్రదికించినావు. ఇట్టి పాపాత్ముఁడు నీచే పరిచర్య లొందుట కర్హుఁడు గాఁడు. తల్లీ! భరింపలేను. నీవు నన్నిఁక నిట్లు బ్రదికింప నెంచకుము. బ్రదికి నిన్ను బాధించినవిషయమును మఱువలేను. జననీ! నీకరు

ణమే, నీదయయే, నన్నా పాదమస్తకము దహించుచున్నది. ”
అని యాతఁడు వెక్కి వెక్కి యేడువసాగెను. దాది కరుణార్ద్రచిత్తయై, యాతనిశరీర మంతయు నిమిరినది. ఆతని నోదార్చుట కెన్ని యోప్రియత్నములు చేసినది.

ఎఱుఁగక విలాసమున కొనరించినపని తప్పని గ్రహించి యాతఁడు పశ్చాత్తాపము నొందినాఁడు. పశ్చాత్తాపమున నాతని పాపము సర్వము మండిపోయినది. పవిత్రీకృతమన స్కుఁడై యాబాలుఁడు పరిశుద్ధి నొందినాఁడు.

పాపిని—జీసస్.

౧

పరమేశ్వరుని పాపావనదీక్ష, దీనదయాపరత్వము, భక్త రక్షణతత్పరత, మొదలగుసద్గుణములు చాలవఱకు 'జీసస్' సందును గలవు. ఎందఱినో పాపుల నాతఁడు రక్షించినాఁడు.

ఒకదినమున 'జీసస్' ఆలివ్సుమెట్టపై కెక్కినాఁడు. ఉదయమగుసరి కచ్చటి దేవాలయముచెంతకుఁ బోయినాఁడు. అతనిని జూచి జను లంద ఱాతనిచుట్టును మూఁగినారు. 'జీసస్' సచ్చట సుఖాసీనుఁ డయినాఁడు. ప్రజలందఱు సావ ధానులైరి. అతఁ డాజనుల కేవేవో హితోపదేశములఁ గావిం చినాఁడు. వా రంద ఱాతని బోధామృతాస్వాదనమున శరీర ములు మఱచి యుండిరి. అంతటను నిశ్శబ్దముగ నుండెను. 'జీసస్' మాటలు మాత్రము దివ్యసంగీతమువలె శ్రోతల నాకర్షించినవి.

అంతట నకస్మాత్తుగ నాలయమునకు దూరమున నేదో పెద్ద కలకలము వినవచ్చినది. "కొట్టుఁడు, ఈడ్వుఁడు" అను పెద్దపెద్ద కేకలు వినఁబడినవి. ఒకవైపునుండి పెద్దజనసమూహము వారివైపునకుఁ గదలి వచ్చుచుండెను. ఎందఱో ఫారిసీలును, పండితులు నందుండిరి. ఆగుంపునకు నడుమ నొకయువతి యుం డెను. ఆ మెతలముడి వీడియుండెను. జాఱిపోయెడి తనవస్త్రము

నప్పుడప్పు డామె సవరించుకొనుచుండెను. ఆమె కన్నుల నుండి రాలిన యశ్రువులు కనుగొలుకులనుండి చాఱికలుగా నెండిపోయెను. గాఢలజ్జాభరమున నామె వదనము వంచి నడచుచుండెను. "అయ్యో! నేనేల యిట్టినీచపుఁబని నొనర్చి వీరిచేఁ బట్టుబడితిని?" నని యామె తనతప్పున కెంతయు వగచుచుండెను. ఆమె మొగమునుండియుఁ జెక్కులనుండియు రక్తధారలు ప్రవహించుచుండెను. ఆమెవస్త్రములు రక్తసిక్తములై యుండెను. ఆమెదీనవదనముఁ గాంచినవారల కెల్ల మిక్కిలి జాలి గలుగుచుండెను.

దిక్కుమాలినయావనితను వారక్తేల లాఁగికొనివచ్చుచున్నారో యనునూహ మహాత్ముఁడగు 'జీసస్' హృదయాకాశమున మెఱసినది. మహాత్ముఁడు గ్రహించినవానివలెఁ దలయూఁపినాఁడు. ఆమెమొగమున నిష్కల్మషభావ మాతనికి గోచరించినది.

౨

ఆగుంపులోనివారందఱిచేతులలోను గర్కశములగు ఱాళ్లున్నవి. వానితోఁ గొట్టి చంపెద మని వారనుకొనుచు మామెను బెదరించుచుండిరి. ఆమె పాప మొనరించినదఁట. ఆమె పాపాత్మురాలని నిర్ధారణఁ గావించుట కెన్నో నిదర్శనములను వారు సంపాదించిరి. ఇట్టి పాపకృత్య మొనరించినయామె 'జీసస్'

ఎట్టిశిక్ష విధించునో తెలిసికొని యాతనియెదుటనే వారామెను ఱాలురువ్వి చంపఁదలఁచిరి. 'జీసస్' తో వారందఱొక్క-పెట్టున నిట్లనిరి.

"అయ్యా! ఈనీచురాలు మిక్కిలి పాపమొనరించినది. ఈపాపాత్మురాలికి మీరు తగిన శిక్ష విధింపఁగలరని మీయొద్దకుఁ గొనివచ్చినారము. మోసెస్ న్యాయశాస్త్రమునం దెట్లాజ్ఞాపింపఁబడియున్నదో తెలియునా? ఇట్టి పాపాత్మురాలిని ఱాలురువ్వి చంపుట కధికార మీయఁబడి యున్నది. దీనికి నీ వేమందు" వని వారాతని నడిగిరి.

ఆతేఁ డాస్త్రీకిఁ దగినశిక్ష విధింపకున్నచో నెట్టులైన వారాతనిపై నేరమును స్థాపించి యాతని మహాపవిత్రత్వమును గాదనఁ దలఁచిరి. కాని యంతలో జీసస్ మహానుభావుఁడు కనులను మూసికొనినాఁడు. చేతుల జోడించి నేలపై మోఁకటిల్లినాఁడు. వారిమాటలను విననివానివలె నేమేమో తన వ్రేలితో నేలపై వ్రాసికొన్నాఁడు. "ఏమి చెప్పెదు" వని యాతనిఁ దిరిగితిరిగి వారడుగుచునే యుండిరి. కాని తమ పాపములనే యాతఁడు నేలపై వ్రాయుచున్నాఁడని వారలు గ్రహింపఁ జాలకైరి. జీసస్ మెల్లగా లేచి కన్నుఁ దెఱచి నల్వంకలను గాంచెను. "నాయనలారా! మీలో నెవ్వఁడైన నొక్కపాపమైన నాచరింపనివాఁ డున్నచో నాతఁడే మొదట నీమెపై ఱాయి విసరవలయును" అని గంభీరముగఁ బలికెను.

తిరిగి జీసస్ మోకాళ్ళపైఁ గుంగినాఁడు. కన్నులు మూసినాఁడు. వ్రేలితో నేమేమో నేలపై వ్రాయుట కారంభించినాఁడు. వారు జీసస్‌మాటలను విన్నారు. ఎవరిహృదయములనువారు పరీక్షింప సాగినారు. గుండెపైఁ జేయి వైచుకొని "నాచరిత్రము నిష్కళంక మైన" దని యొక్కఁడును బలుకలేకపోయెను.

ఎవనిమ్మునకు వాఁ డేదేనిఁ బాప మొనరించినవాఁడే. ప్రమాదమునఁ గాని, బుద్ధిపూర్వకముగఁ గాని, యేచిన్న పాపమును జేయనివాఁ డుండఁడు. కాని పశ్చాత్తాపము పాప నిర్మూలనముఁ గావింపఁగల దనుట నిర్వివాదాంశము. అంతలి పండితు లందఱుఁ బాపము లాచరించియుఁ దమఖ్యాతి కెక్కడఁ గళంక మాపాదిల్లునో యనియెంచి యెవ్వరును దమతప్పునొప్పుకొనరైరి. ఒక్కొక్కరే క్రమముగ గుంపును వీడి బైటికి వెడలిపోయిరి. వారికి మాత్ర మంతరాత్మలు లేవా? మీరు గూడఁ గొంత పాప మొనరించినా రని వారి కవి చెప్పినవి. వారియంతరాత్మలకు వ్యతిరేకముగ నడచినచో వారలుమఱింత నేరముఁ గావించినవా రగుదురు.

జీసస్‌మాట లందఱితలలకు నెక్కినవి. అందఱు నచ్చటి నుండి వెడలిపోయిరి. జీసస్‌మాత్ర మచ్చట మిగిలెను. అం డటులనే వంగియుండెను. అమ యట్లె యూతని యెదుటనే నిలువఁబడి యుండెను. జీసస్ మెల్లగ లేచి కన్నులఁ దెఱచెను ఆమెతప్ప నచ్చట మఱియెవ్వరును లేరు. ఆతఁ డామెవైపు

నకుఁ దిరిగి "అమ్మా! నీయందు నేర మారోపించినవార లంద ఱేమయినారు? వారిలో నొక్కఁడును నిన్ను నిందింపఁ జాలకపోయెనా?" యని యడిగెను.

"దేవా! న న్నెవ్వరు నేమియుఁ జేయలేదు. నీవుఁ గూడ న ట్లనుగ్రహించెదవుగాక" యని యామె ప్రత్యుత్తర మిచ్చెను.

"నేనుమాత్ర మెందులకు నిందింతును. నీవు పశ్చాత్తాప మొందితివి. కావున నీపాపము లెల్లను నశించినవి పొమ్ము. నీదారిని నీవు వెడలిపొమ్ము. ఇఁక నెన్నఁడుఁ బాప మొనరింపకు" మని చెప్పి యాతఁ డామె నతిదయార్ద్రహృదయముతో నోదార్చెను. తలను పై కెత్తి యామె జీసస్దయాప్రసన్న వదనమును వీక్షించి కన్నీటిధారలఁ గురిసినది. హృదయాంకాశమున నావరించియున్న పాపపుమేఘము వర్షించి యంతటను నిర్మలముగఁ జేసెను. ఈశ్వరుఁ డామె కెంతమృదులముగ నీపాఠమును నేర్పెనో!

ఆమె యొనరించిన దుష్కృత్యము లొక్కటొక్కటిగ నామెకు జ్ఞప్తికి వచ్చినవి. ఆమహాత్ముని వాగమృత మామెను నిష్కల్మషురాలిని గావించినది. చేసినపాపము లెల్లఁ గన్నీరుగా నామె వెలికిఁ గ్రక్కివేసినది. హృదయముతోఁబాటు దేహము పరిశుద్ధత నొందినది. పశ్చాత్తాపమునఁ బాపనాశన మైనది. పాపిని పావనాత్మ యైనది.

అహింసకుఁడు—బుద్ధుఁడు.

౧

ప్రసేనజిత్తుఁడు కోసలరాజ్యప్రభుఁడు. వేదవేదాంగవిదుఁడగు భార్గవుఁ డాతనిపురోహితుఁడు. కొంతకాలమున కీ భార్గవున కొక పుత్త్రుఁ డుద్భవిల్లెను. తల్లిదండ్రులు మహానందమున మేనులు మఱచిపోయినారు. ఈశుభవార్త మహారాజునకుఁ దెలిసినది. ఆసద్బ్రాహ్మణునకుఁ దనయానందమును దెలియఁబఱచినాఁడు. 'అహింసకుఁ' డని యాబాలునకుఁ బేరువెట్టిరి.

భార్గవుఁడు జ్యోతిశ్శాస్త్రపారంగతుల రావించి తన కుమారునిజన్మనక్షత్రాదులను వారికిఁ దెలియఁబఱచి జాతకమును వ్రాయఁ గోరినాఁడు. పండితు లందఱుఁ బిల్లవాని తారాబలముఁ బరీక్షించినారు. వారిమొగములు వెలవెలఁబోయినవి. హృదయములలోనియానందమంతయు మాయమయ్యెను. 'అహింసకుఁడు' పరమహింసకుఁడును, దుర్మార్గుఁడును నై, లోకులఁ దల్లడపఱచి యనేకప్రాణములఁ దీయునని చెప్పినారు.

భార్గవున కీమాటలు శూలములై పోయినవి. ఏమిచేయుటకును నాతనికిఁ దోఁచినదికాదు. తనకుమారునివలనఁ బ్రజల కెట్టి కష్టము వాటిల్లినను, దాను సహింపలేఁడు. లేక లేక కలిగినవాఁడగుటచేఁ దనయునిఁ బాలియింపలేఁడు. మిక్కిలి

దీర్ఘాలోచనఁ జేసినాఁడు. కొమరునివలన నెందఱో విగతజీవు లై పోవుటకంటెఁ గొమరుఁడే చనిపోవుట మేలని తలఁచినాఁడు. అహింసకు నప్పుడే చంపుటకు నిశ్చయపఱచుకొన్నాఁడు. మహారాజీవిషయమును గ్రహించినాఁడు. వెంటనే పురోహితునిఁ గలిసికొని యతనియభిప్రాయము చెడ్డ దనియు, సుతుఁ డెంతటిదుర్మార్గుఁ డైనను గన్నతల్లిదండ్రులే తమకొమరుని జంపుకొనుట విపరీతముగ నుండు ననియు, దుర్వ్యాపారములలోఁ జొరఁబడకుండ జాగ్రత్తగఁ గాపాడుకొన్నచో నహింసకుఁ డెన్నటికి దుర్మార్గుఁడు కాఁజాలఁ డనియు ననేకవిధముల బోధించి భార్గవునిసంకల్పమును వారించినాఁడు

అహింసకుఁడు క్రమముగఁ బెద్దవాఁ డయ్యెను. జననీజనకులయాజ్ఞ నెన్నఁడును జవదాఁటలేదు. గురువులు గీచిన గీఁ దాఁటలేదు. అధ్యాపించినవిషయము లందఱిబాలురకన్న నెక్కుడు శ్రద్ధతో నభ్యసించుచుండెను.

భార్గవుఁ డహింసకుని సకలవిద్యాపారంగతునిఁ గావింపఁ దలఁచినాఁడు. పురాతననగరములలో విద్యాపీఠ మని వన్నెకెక్కిన తక్షశిల కాతనిఁ బంపించి యచట విద్యఁ గఱపింపఁ దలఁచి తగుప్రయత్నములు గావించెను. అప్పటి యహింసకుని సత్ప్రవర్తనము చిన్నప్పుడు జ్యోతిష్కులు చెప్పిన మాటలను మఱపించినది.

అహింసకుఁడు తక్షశిలానగరమున కేఁగి యచ్చటి విద్యాశాల లన్నిఁటిలోను మిన్నయగుదానియందుఁ బ్రవేశించి

నాఁడు. ఆతనిముఖవర్చస్సు, చుఱుకుదనము, తెలివితేటలు, గురువుల నాకర్షించినవి. ఆతఁడు దినదినము విద్యలయందుఁ బ్రవీణతను సంపాదించుచుండెను. ఉపాధ్యాయు లేదిచెప్పిన నదియెల్ల వెంటనే గ్రహించి మనసున కెక్కించుకొనుచుండెను. గ్రహణశక్తియందు, వాక్ప్రౌఢియందు నీతఁడు తక్కిన విద్యార్థుల నందఱను మించియుండుటచే నీతనిపై గురువులు కెక్కుడు ప్రేమ ముదయించెను.

౨

అహింసకుఁడు తెలివితేటలు గలవాఁడును, జ్ఞానపరితుఁడు నయినప్పటికిఁ గొంచెము కొంటెతనము గలవాఁ డగుటచేఁ దోడిబాలుర కాతఁడన్న నసహ్యము బైలుదేఱినది. ఆతఁడు వారిలోఁ గొందఱఁ గొట్టియుఁ గొందఱఁ దిట్టియు మిక్కిలి బాధించెను. అతనిచేష్టలకుఁ దక్కినబాలు రెల్లరు మిక్కిలి కినియుచుండిరి. బాలు రెల్లరుఁ బట్టఁ జాలనికోపమున గురువులచెంతకుఁ బోయి యహింసకునిపై నెల్లప్పు డేవో యపచారముల నున్నవికొన్నియు, లేనివికొన్నియుఁ గల్పించి చెప్పుచుండిరి. గురువు లాతనియందలి సదభిప్రాయముచే నాతని నెక్కువగఁ జీవాట్లు పెట్టరైరి. దినములు కడచినకొలఁది నహింసకునిదుండగములు మితిమీఱిపోయినవి. సహాధ్యాయు లెంతయు విసిగిపోయిరి. అధ్యాపకులును సహింపలేకపోయిరి.

ఉపాధ్యాయు లొకదినమున నహింసకునిఁ దమచెంతకుఁ బిలిచి " ఏమోయీ ! నీయాగడము మితిమీఱిపోవుచున్నది. నీ వీకముం దెట్టిదుష్టచేష్ట లొనరించినను గఠినముగ శిక్షింపక మాన " మని చెప్పిరి. కాని వారిమాటలపై నాతఁ డిసుమంతయు లక్ష్య ముంచలేదు. ఎప్పటిమార్గముననే సంచరించుచుండెను. గురువు లీతని దుష్ప్రవర్తనము నెట్లయిన మాన్పింపవలయు నని యనేకప్రయత్నములఁ గావించిరి. కాని ఫలితమేమియు లేకపోవుటచే వా రాతని కొక యసాధ్యమైనకార్యము నియోగింప నెంచిరి. అట్టి యమానుషకార్యము నొనరించుటకు వెఱచి యాతఁ డికముం దెట్టిదుర్నయములను గావింపనని వేఁడుకొని సన్మార్గమునఁ జరింపఁ గలఁడని వారు తలఁచిరి.

" అహింసకా ! నీ వీవిద్యాలయమున నుండుటకు యోగ్యుఁడవు కావు. నీమూలమునఁ దక్కినబాలు రెల్లరును జెడిపోవుచున్నారు. వారు నీవలన నెన్నో కష్టములకుఁ గూడఁ బాలగు చున్నారు. కావున నీవీక్షణమందే యీప్రదేశమును విడిచిపోవలయును. నీకంతగ విద్యాభిలాష కల దేని, నీ వీ విద్యాలయమందే విద్య నేర్చుకొనఁ దలఁచితివేని మేము నీ కొక కార్యము నియోగింతుము. జంకక నీ వద్దానిని నెఱవేర్పవలయును. నీకది యిష్టమేనా" యని యడిగిరి. " మీరు విధించిన దెట్టికార్య మైనఁ దప్పక నొనరింపఁ గలవాఁడ " నని యహింసకుఁడు బదులు చెప్పెను. "నీవు వేయిమందిమనుష్యు

లను జంపి వారలకుడిచేతిబొటనవ్రేళ్లను గుఱుతుగాఁ దెచ్చి మాకుఁ జూపవలయును. అట్లయినచో మరల నిన్నిందుఁ జేర్చుకొనఁగల" మని వారు వచించిరి.

గురువు లాతనిముఖలక్షణములను బాగుగఁ బరిశీలింపఁ దొడఁగిరి. ఆతనిలో నేదైన మార్పుండునని వారియభిప్రాయము. అహింసకుఁడు వారిమాటల నన్నింటిని విన్నాఁడు. గురువు లనుకొనిన ట్లాతఁడు డించుకయుఁ బశ్చాత్తాప మొంది యుండలేదు. 'మీయాజ్ఞప్రకారము నేను వేయిమందిని జంపి వారి యంగుళులను దెచ్చి యిచ్చెద' నని యాతఁడు వచించి తత్క్షణమే యటనుండి వెడలిపోయెను.

3

అరణ్యమార్గమునఁబోవు బాటసారుల కెన్నఁడునులేని యిక్కట్టులు నేఁడు తటస్థించినవి. ఆమహారణ్యమున నెనిమిది బాట లొక్కచోటఁ గలిసియున్నవి. ఎవ రేయేబాటవెంట వచ్చినను నీస్థలమునకు రాకతీరదు. ఇచ్చట నొక యువకుఁ డొకభయంకరమైనకరవాలమును జేతఁ గైకొని మార్గమునఁ బోవు బాటసారుల నెందఱనో నిరంతరముఁ జంపుచుండెను. ఆఁడువారనికాని, పసివారనికాని, ముదుసలులనికాని యెంత మాత్రము విచారణ లేక మహాక్రూరత్వమున నాతఁ డెందఱనో యవలీలగ నఱికి చంపినాఁడు. ఆయడవియంతయు రక్తమయ

మైపోయెను. చుట్టుపట్లనున్న గ్రామములలోని ప్రజ లెల్లరు భయకంపితు లైరి. ఈవార్త దేశమందంతటను వ్యాపించెను.

భార్గవున కీవృత్తాంత మంతయుఁ దెలిసెను. కుమారుఁ డొక్కమా ఱాతని మనసులోఁ బొడసూపినాఁడు. 'నరహంత యహింసకుఁడే యయియుండునా?' యనియాతఁడూహించెను. తప్పక యాతఁడే యయియుండు నని నిశ్చయపఱచుకొనెను. మహారాజగు ప్రసేనజిత్తుఁడుఁగూడ నీవృత్తాంత మంతయుఁ దెలిసికొని కొంత యలజడి నొందినాఁడు. తనరాజ్యమున నట్టి క్రూరకృత్యములు జరుగుచున్నందులకై మిక్కిలి సిగ్గుపడి నాఁడు. ఆదుర్మార్గు నెట్టులైనఁ బట్టుకొని ప్రజల నుద్ధరించుట కాతఁడు కంకణముఁ గట్టుకొన్నాఁడు.

భార్గవుఁడు రాజుచెంత కరుదెంచి 'మహారాజా! ప్రజాహంత నాకొడుకే యని తోఁచుచున్నది. వీఁ డిట్టివాఁ డగు ననియే నేను చిన్నతనమందే వీనినిఁ జంప నెంచితిని. మీరు దూర మాలోచింపక నన్ను వారించితిరి. గోటిచేఁ గాఁదగు పని గొడ్డటిచేఁ జేయవలసివచ్చినది. కొఱవిచేఁ దల గోఁకికొనిన ట్లయినది. వీనివలన నెందఱో ప్రజలు కడతేఱుచున్నారు. ఈదుష్టు నెట్టులైన వెంటనే పట్టించి ప్రాణములఁ దీయించుట యుత్తమ' మని పలికెను.

పాప మహింసకునితల్లి శోకాకులిత యైనది. కొడుకెట్టి క్రూరకర్ముఁ డైనను దల్లి వానినిఁ జంపుటకు సహించునా?

ఆమెవిచారమునకు మేర లేకుండెను. వెంటనే రాజు పరివారయుతముగ నహింసకుని బట్టుకొనుటకై బైలుదేఱెను.

నరాంతకుఁడైన యాబ్రాహ్మణకుమారునకు దయాదాక్షిణ్యములు నశించినవి. దారుణకృపాణముచే నెందఱితలలనో నఱికినాఁడు. వారియందఱియంగుళులను నొకమాలగా గ్రుచ్చినాఁడు. త్వరలోనే వేయియంగుళులను బూర్తి చేసి గురువుల యాజ్ఞఁ జెల్లింపఁ దలఁచినాఁడు. ఇప్పటికిఁ దొమ్మిదివందల తొంబదితొమ్మిదియంగుళులు సమకూర్పఁబడినవి. మఱియొక యంగుళితో మాల పూర్తి యగును. ఇప్పు డాతనికి మఱింత యాత్రము జనించినది. ఇఁక నొక్క మనుజుఁడైపున కఱుదెంచినచో నాతని శ్రమము ఫలించును. ఆయొక్క యంగుళికై యాతఁడొక్క నిముస మాలస్యమునకైన సహింపలేకుండెను. అట్టితఱి మహారాజైదురైనను జంపితీరును. తుదకుఁ దల్లినైనఁ దండ్రినైనఁ జంపుటకు సందేహింపఁడు. ఆతనికి క్షణ మొకయుగముగఁ దోఁచుచుండెను. తుద కాయొక్క యంగుళి లభింపదేమోయను సంశయము గలిగెను.

3

జేతవనము మహాశాంతియుతమైనది. ప్రతివృక్షము నుండియుఁ గరుణారస మొలుకుచుండును. నిర్భయముగా నెన్నోజంతువులు సంచరించుచున్నవి. 'ఎన్నోపక్షులు' పాటలు

పాడుచున్నవి. మహానుభావుఁడగు బుద్ధభగవానుఁ డాజేతవన ములో, బోధివృక్షము క్రిందఁ గూరుచుండి తపస్సు చేసికొను చున్నాఁడు. పరమదయాస్వరూపుఁ డగు నాగౌతమబుద్ధుఁడు నరహంతవృత్తాంత మంతయుఁ దెలిసికొన్నాఁడు. వాని నెటు లైన సన్మార్గమునఁ బెట్టఁదలఁచి యాతఁడు సంచరించునరణ్య మున కేతెంచినాఁడు.

అహింసకుఁడు రక్తారుణితములై, భయంకరములైన తన నేత్రములఁ దెఱచుకొని, నిశితకరవాలమును జేతఁ బూని యెవ్వరెదురౌదురాయని దిక్కులఁ బరికించుచుండెను. అంతలో బుద్ధసన్న్యాసి తనవైపునకే వచ్చుచుండెను. నరహంత యాబుద్ధసన్న్యాసిని దూరముననే కాంచి తనసంకల్ప మిప్పటికి నెఱవేఱినదని తలఁచినాఁడు. హృదయమున నమితోత్సాహ మొందినాఁడు. తత్క్షణమే వానిని జంపనెంచి ముందుకుఁ బరు గెత్తినాఁడు. ఈతఁడు కొంతదూరముననుండగనే యాసన్న్యాసి వెనుకకు మరలెను. కాలికొలఁదిఁ బరుగెత్త నారంభించెను. అహింసకుఁ డాతనివెంటనంటి పరుగెత్తినాఁడు. ఎంతపరుగిడినను నతఁ డాసన్న్యాసిని గలిసికొనలేకపోయినాఁడు. ఎంతోబల ముపయోగించి యాతనిని మించిపోవఁ బ్రయత్నించినాఁడు. కాని సన్న్యాసి యంతకంటె వేగముగఁ బరుగెత్త సాగెను. అహింసకుని శరీరములోనిశక్తి తగ్గిపోయినది. పిక్కలలోనిబల ముడిగిపోయినది. మనసులోనిధైర్యము జాఱిపోయినది. భరింప

కాని యాయాసముతో నిట్లు సన్న్యాసికి వినఁబడునట్లు కేక వేసి చెప్పెను.

"ఓయీ! దయ యుంచి యక్కడనే నిలుచుము. నే నిఁక నిన్నుఁ బట్టుకొనలేను" సన్న్యాసి "ముందుగ నీ వచ్చట నిలిచినచో నేనును నిచ్చట నిలువఁ గల" నని సమాధానముఁ జెప్పెను. అహింసకుఁ డాఁగెను. తనదుర్బలత్వ మున కెంతో యాశ్చర్యపడెను. సన్న్యాసి నిలువఁబడి వెను కకుఁ దిరిగిచూచెను. దీర్ఘనిశ్వాసములు పుచ్చుచు భూమిపై నిలుచుటకుఁగూడ బలములేనికాళ్లతోఁ దూలిపోవుచుండెడి యహింసకునికిఁ దన దివ్యమూర్తిని బ్రదర్శించెను.

అహింసకుఁడు ప్రశాంతిగంభీరమూర్తియైన యాబుద్ధ దేవునిదివ్యరూపమును దర్శించి మోఁకరిల్లి ప్రణామముఁ గావిం చెను. బుద్ధభగవానుఁ డాయహింసకునకు. నమృతోపమానము లగు వాక్కులతో దయాసిద్ధాంతము, నహింసాసిద్ధాంతము నుపదేశించెను. ఆదయామయునికన్నులనుండి కరుణారస మొలికి పోయెను. వాక్కులలో నతిమధురమగు దయారసము స్రవిం చెను. ఆగంభీరోపదేశమున కహింసకుఁడు మంత్రముగ్ధునివలె నచేతనుఁడై పోయినాఁడు. ధర్మమునుమూర్తీభవించిన యమృతమయ వాణి బుద్ధునిముఖమునుండి వెలువడఁగనే విస్మయస్తబ్ధుఁ డైనాఁడు.

అహింసకునిహృదయము తొలుత వజ్రాతికఠినము. ఇప్పు డది నీరైనది. కన్నులనుండి యశ్రువర్షము కురిసినది. పశ్చా

త్తాపముచే శరీరము భస్మమైనది. పునర్జన్మము నొందినాఁడు.
తత్క్షణమే యాతఁడు బుద్ధభగవానునిపాదములపైఁ బడి

"బుద్ధంశరణంగచ్ఛామి,
సంఘంశరణంగచ్ఛామి,
ధర్మంశరణంగచ్ఛామి"

అని త్రిశరణముల నొందినాఁడు. గౌతమబుద్ధుఁ డతని లేవనెత్తినాఁడు. కౌఁగిటఁ జేర్చుకొనినాఁడు. తనతో జేతవనమున కాతనిఁ దీసికొనిపోయినాఁడు. పరమకౄరుఁడైన నరహంత యిప్పుడు పరమసాధుభిక్షుకుఁ డైనాఁడు. బుద్ధాశ్రమమునందలి భిక్షుకులలో నహింసకుఁ డన్నివిధముల ఘనత వహించినాఁడు. ఆశ్రమనిర్వహణములో బుద్ధభగవానున కన్నివిధములఁ దోడ్పడినాఁడు.

ప్రసేనజిత్తుమహారాజహింసకునికొఱకై యనేకఘోరారణ్యములఁ దిరిగితిరిగి యెచ్చటను గానక మిక్కిలి వేసారి తుదకు జేతవనముఁ బ్రవేశించినాఁడు. బుద్ధదేవుని దర్శించినాఁడు. తన యాగమనకారణ మాతనికి విన్నవించినాఁడు. అహింసకుఁడు చేఁజిక్కినచో నాతనికి గొప్ప శిక్ష విధించి లోకము నుద్ధరించెద నని పలికినాఁడు. బుద్ధుఁ డామాటలన్నియు విని "రాజా! సాధుశ్రేష్ఠున కెట్టి శిక్షవిధింతు" వని యడిగెను. రాజందుల కాశ్చర్యపడెను. పిమ్మట బుద్ధుని యాజ్ఞపై నటకొక భిక్షుసన్న్యాసి యరుదెంచెను. రాజాతని

గుర్తించెను. అతఁడే యహింసకుఁ డని గ్రహించెను. మహా నందమునఁ దనమెడలోని ముక్తాహారము నాతనికంఠమున నలంకరించెను. కాని సర్వసంగపరిత్యాగియగు నహింసకున కా ముక్తాహారముతోఁ బనియేమి?

పాపాసక్తుఁడును, దురాచారుఁడు నగు మహాహంత పశ్చాత్తాపమునఁ బుణ్యవంతుఁ డైనాఁడు. ఆతని శరీరము పవిత్రమైనది. జీవనము ధన్య మైనది.

వాల్మీకి—బాలిక

౧

హిమవత్పర్వతప్రాంతమున నొక యరణ్యము కలదు. అాకసమంటుడియెత్తైనవృక్షము లచ్చటఁ గిక్కిఱిసియున్నవి. ఎన్నో యడవిమృగము లచ్చట నిర్భయముగ సంచరించు చున్నవి. ఫలభరితములగువృక్షశాఖలపైఁ బక్షులు కలకలఁ గూయుచున్నవి. ఒరులకుఁ జొర శక్యముకాని నిర్మానుష్య మగు న మ్మహారణ్యమునఁ గొందఱు చోరులు ప్రవేశించిరి. క్రూరులగు నాచోరు లాయరణ్యమును జీకాకు పఱచిరి. వా రందలి మృగములను బక్షులను జంపి తినుచుండిరి. వృక్షముల నన్నిటిని నాశనము చేసిరి. సమీపముననున్న పల్లెలను బట్టన ములను గొల్లగొట్టి సొమ్ముల నాయరణ్యమునకుఁ గొంపోవు చుండిరి.

బాటసారులనుబట్టి బంధించి పలువిధముల బాధఁబెట్టు చుండిరి. ఎందఱుస్త్రీలనో చెఱపట్టిరి. వారియిష్టదేవతయగు కాళికాదేవి కెందఱోపురుషులు, నెందఱోస్త్రీలు బలి యీయఁ బడిరి. చెడఁద్రావి వారొనర్చెడి ఘాతుకకృత్యము లతిభయం కరములుగ నుండెను. అత్యంతశోభామయమైన కన్నుల కానం దముఁ గొల్పెడి నాయరణ్య మంతయు నాదొంగలగుంపు

కాలిడినకొలఁదిదినములలోనే శూన్యమై శ్మశానవాటికయై పోయినది. రక్తముచేఁ దడిసి నేలయంతయు నెఱ్ఱనై పోయినది.

ఒకనాఁటిసాయంకాలమున నాదొంగ లందఱు నడవిలో నొకమూలనుండి కాళికాలయమువైపున కరుదెంచుచుండిరి. ఆగుంపులోని కోలాహలమున కరణ్యమందలి ప్రాణికోటి యంతయు గడగడ వణఁకినది. ఆనందముగఁ గ్రొల్లుచుండు లేళ్ళు మొదలగు జంతువులు మూలమూలల దాఁగుకొనినవి. మనోహరముగ గానముచేయుచుండు పక్షులు గూండ్లలో నక్కినవి. నాగ[illegible] [illegible]ములకు మన్నుమిన్ను గూడ నదరినవి. ఎవరినోటికి వచ్చినట్లు వారు వదరఁ జొచ్చిరి. మూటలలోనిధనమును బైకెగురవైచుచు "నింతధనము దొరకునని యనుకొనలే" దని యొక్కఁడును, "స్త్రీలని, పసిపాపలని, నఱకుటకు సందేహించినచోఁ గార్య మెట్లగు" నని యింకొకఁడును, "నీధనమంతయు నేనే నాయకునకు సమర్పింతు" నని మఱియొకఁడును జెప్పుకొనుచుఁ గేకలిడుచు, నాడుచుఁ బాడుచు, నాలయమును సమీపించిరి.

దొంగలనాయకుఁ డాలయద్వారముకడ నిలువఁబడి యున్నాఁడు. అతఁడు బలిసిన నల్లని శరీరము నాజానుబాహువులుఁ జింతనిప్పులవంటినేత్రములుఁ గలిగి హస్తమునఁ గత్తియు భుజమున బాణతూణీరములను ధరించియుండెను. అతని జూచినతోడనే పచ్చిమాంసముఁదిని రక్తముఁద్రావు క్రూరరాక్షసాకారము జ్ఞప్తికివచ్చును.

దొంగలందఱు తకీమీనికి జోహారులు చేసిరి. దోచుకొని తెచ్చిన ధన మంతయు నాతనిపాదములచెంతఁ బోసిరి. నాయకుఁ డదిచూచి వా రొనరించినఘనకార్యమున కెంతయు సంతసించినవానివలెఁ దల యూఁపినాఁడు. "నేఁ డమావాస్య. నేఁటి రాత్రి కాళికకు గొప్పబలి నీయవలెను. మహాకాళిని జూచితిరా? రక్తముకొఱకై నో రెట్లు తెఱచుకొనియున్నదో! కన్నులెఱ్ఱచేసి నిప్పులఁ గ్రక్కుచున్నదో! మీసామర్థ్యమును నేఁడు నేను కనుఁగొనెదను. ఆదేవికోప ముపశమింపఁజేయుట కెట్టిబలియుక్తమో మీకే తెలియును. ఆమెభయంకరరూపముఁ ద్వరగఁ జల్లఁబడఁ జేయవలెను. ఆమెయాగ్రహము శమింపఁ జేయవలెను. ఇదిగో! నాచేతిలోనిక్రుపాణము. ఆదేవిని దృష్టిపఱచుట కెప్పుడును రక్తపుటేఱులఁ బ్రవహింపఁ జేయుదునని చెప్పుచున్నటు లెట్లుతళతళలాడుచున్నదో! చూచితిరా!" యని వారిని హెచ్చరించెను.

కాళికాదేవిసంప్రీతికొఱ కెట్టికార్య మొనరించుటకైనను వారు వెనుదీయరు. "ఏలిక చెప్పినచొప్పునఁ దప్పక చేసెద" మని వార లావెంటనే కుండలలోనికల్లంతయు దొన్నెలలోఁ బోసికొని కంఠములవఱకుఁ దార్చినారు. అత్యుత్సాహమునఁ గత్తులు కటారులు మున్నగువానిని బట్టుకొని బైలు వెడలినారు.

౨

సూర్యుఁ డప్పుడే క్రుంకినాఁడు. ఎల్లెడ నల్లని చీఁకటు లలముకొనఁ జొచ్చెను. ఆకసమునంతటను గాఢముగు మబ్బు లావరించినవి. ఉఱుములు, మెఱుపులు, పిక్కటముగ నుండుటచేఁ గాననమంతయు భీతిఁ గొల్పుచుండెను.

అట్టిసమయమున నా గహనమందొకమూల నొక బాలిక తిరుగుచున్నది. ఆయడవిచేరువనేకల యొకపల్లెనుండి విహారమునకై యామె బయలుదేఱి ప్రొద్దుపోవుటచే దారిఁదప్పి యాయడవిని బ్రవేశించినది. ఏమిసేయుటకును దోఁచక భగవంతుడా! యని నిట్టూర్పు విడుచుచు మతిచెడియిటునటుఁ దిరుగుచున్నది. ఆమె పదునాల్గువత్సరములప్రాయము గలది. పరమసుకుమారి. ఆమెమృదుపాదములకు, రాళ్ళు, ముండ్లు మొదలగునవి గ్రుచ్చుకొనుటచే నింతింతనరానిబాధ నొందుచు నుఱుము ఉఱుమునకుఁ గంపించుచు మెఱుపుమెఱుపునకుఁ దల్లడిల్లుచుఁ బెద్దపెట్టున రోదన మొనరింప సాగెను.

దూరముగవినవచ్చు నీబాలికరోదనధ్వని చోరులచెవినిఁ బడినది. "ఆహా! స్త్రీకంఠమే." యని వారు సంతోషమునఁ గంతు లిడుచుఁ బరుగెత్తుకొనివచ్చి మెఱపులకాంతిలోఁ దళతళలాడు నాబాలికను బట్టుకొనిరి. ఇద్దఱుదొంగ లామెహస్తములను గట్టిగాఁ బట్టుకొనిరి. వారియాకారములను, జేష్టలను

జూచినంతనే యామెకు స్పృహ తప్పిపోయెను. పిమ్మటఁ గొంత సేపున కొక్కించుక తెలివినొంది గడగడ వణఁకిపోయినది. శరీర మంతటను ముచ్చెమటలు గ్రమ్మినవి. గుండెలు దడదడఁ గొట్టుకొనసాగెను. నోట మాటవచ్చుట కెంతో కష్టమయ్యెను.

"తండ్రులారా! నాపల్లెనుండి [illegible]గ్రామమునకై చనుదెంచి దారి దప్పి యీయడవిలో నల్లలాడుచుంటిని. దయయుంచి నన్ను నాయింటికిఁ జేర్చి పుణ్యముఁ గట్టుకొనుఁ" డని యాబాలిక వారల నతిదీనముగ వేఁడుకొనెను. వారామెప్రార్థన నాలింపక యరణ్యమధ్యమునకామె నీడ్చుకొనిపోవఁదొడఁగిరి.

సౌందర్యవతియగు నాయువతిరక్తముఁ గాళిక యెంతో యానందమునఁ ద్రావుననియు, నామెయుంగనులఁబొంగుచు నారగింపఁ గలదనియు, వారలు చెప్పుకొనుచు "జయా! కాళికాదేవి! జయా!! మహాశక్తి" యని దిక్కు లదరిపోవునట్లు కేకలువైచుచుఁ బోయి కొంతవడికి నాయకుని సమీపించిరి.

ఖడ్గపాణియై వీరలరాక కెదురుచూచునాయకుఁ డాయన్నులమిన్నను గాంచి యీయువతి కాళికాశక్తికి బలియీయఁ దగినదని మనమున సంతోషించుచు దొంగలను జూచి చిఱునవ్వు నవ్వినాఁడు.

"తండ్రీ! నిరపరాధ నగు నన్నీ క్రూరులబారినుండి తప్పించి నాగృహమునకు నన్నుఁ జేర్చి పుణ్యముఁ గట్టుకొనవా?" యని యాబాలిక దొంగలయేలికపాదములపైఁ బడి

బిగ్గరగా నేడువసాగెను. కాని నరహంతయగు నా నాయకుఁ డామెకీర్ఘతర కేశబంధముఁ జేతనొడిసిపట్టుకొని బిరబిరనామె నీడ్చుకొనిపోయి కాళికయెదుట నిలువఁబెట్టినాఁడు. తనచేతి యందలి నిశితాసి నాడించుచు నాయబలను జడిపించినాఁడు.

ఆబాలిక తనకిఁకఁ జావునిశ్చయ మనియెంచి కంటికి మంటికి నేకధారగా నేడ్చుచు "ఓపరమేశ్వరా! నేనిక్కడ దిక్కుమాలినదాననై చావ సిద్ధముగ నుంటిని. దీనరక్షకుఁడ వగు నీ విప్పట్టున నన్ను రక్షింప వేఁడుకొనుచున్నా"నని బిగ్గరగ నేడ్చుచు జాలిఁగొలుపుచూపులతో దొంగలనాయకుని మొగము వీక్షించెను.

నాయకుడు "తల్లీ! మహాదేవీ! కాళీ! కరాళీ!" యని బిగ్గరగ నఱచుచు నెడమచేతితో నాపూఁబోఁడి తలముడి నటులనే పట్టుకొనియుండి కుడిచేతిలోఁగల వాఁడిఖడ్గముచే నామె కంఠమును నఱకుటకై పైకెత్తినాఁడు.

ఆజవరాలిదీనవీక్షణము లాతనివదనమునందే నిలిచి యున్నవి. ఆచూపు లాతనిమనసులో నొక్కమెఱపు మెఱయఁ జేసినవి. ఎత్తినచేయి యెత్తినట్లే యుండెను. కోపముచే నెఱ్ఱనగు నాతనినేత్రములనుండి బాష్పములు రాలినవి. కఠినమును, ఘోరమును నగు నాతనిమనస్సు మెత్తనైపోయినది. మొగము నందుఁ గరుణారస ముదయించినది. చేతిలోని కేశబంధ మూడి పోయినది. కత్తి జాఱిపోయినది.

3

ఆతనిహృదయమునఁ గలిగిన దుర్బలత్వమున కాతఁడే విస్మితుఁ డాయెను. "అకటా! నా కెన్నఁడును లేనియున దైన్యము నేఁ డెటుల సంభవించెను? నే నెందఱు బాటసారుల తలలనో బ్రద్దలుగొట్టి వారిసొమ్ముల నపహరించితినే! లెక్కకు మించిన స్త్రీలను, పసిబిడ్డలను నా నిశితకరవాలముచే నఱికి వారి రక్తధారల నీకాళికాదేవి నభిషేకించితినే. నేఁడు నాహృదయమున నీకరుణరస మేల? నాకన్నులలో నీయశ్రువు లేల? నాకిదియంతయు మాయగానున్నదే" యని నిశ్చేష్టుఁడై పోయెను.

పిమ్మట నాతఁడు కాళికవైపు చూచెను. ఆమెకుఁ గోపము వచ్చిన ట్లాతఁడు గ్రహించెను. రెండుచేతులును జోడించి "తల్లీ! ఇంతవఱకు నేఁ గావించిన ఘాతుకకృత్యములకు లెక్కలేదు. జాలిఁగొల్పెడి యీబాలికామణివీక్షణము లిప్పుడు నన్నుఁ బూర్తిగ మార్చివేసినవి. నీరౌద్రాకారము నుపసంహరింపుము. నన్ను నీక్రోధాగ్నులచేఁ గాల్చి భస్మ మొనరింపఁ దలఁచినను నిఁక నిట్టి క్రౌర్యమిసుమంతయైన నాచరించుటకు నాచేతు లాడవు" అని వచించి యాదేవియెదుటినుండి యాబాలిక నీవలికిఁ దీసికొనివచ్చెను.

నాయకునిచర్య దొంగ లందఱకు నాశ్చర్యముగఁ దోఁచెను. ఈతనిచేతఁగాకపోయినచో మనమే యొక్కనిము

వనములో నీమెశిరస్సుఖండించెద'' మని వారా నారీమణిని బట్టుకొనుటకుఁ బ్రయత్నించిరి. కాని నాయకుఁడు వారిని వారించెను.

అచ్చటనే యొకచెట్టుకొమ్మపై రెండుపక్షులు కూర్చుండియున్నవి. ఒకదొంగ యాపిట్టలను బట్టి చంపుటకై యత్నించుచుండెను. నాయకుఁ డది గాంచి పరువుపరువున వానిచెంతకేఁగి ''నాయనా! అంతమధురముగ, నంతయానందముగఁ గంఠమెత్తి గాన మొనరించెడి యాపక్షులు నీకేమియపకార మొనరించినవి? వానిగానము వినుటకు నీ విష్టపడవా? వాని వింతవింత రంగులశృంగారము నీహృదయమును రంజింపఁ జేయదా? నీ వింతటినుండి వాని నెన్నఁడును జంప నెంచకు'' మనిచెప్పి వానిని మరల్చెను. పిమ్మట నావైపునకే రెండు హరిణము లేతెంచెను. మహానందమున నృత్య మొనరించెడి యాలేళ్ల నింకొక చోరుఁడు చంప బాణము సంధించెను. వానినిగూడ నట్లే నాయకుఁడు వారించెను.

దొంగలనాయకుఁ డాబాలికను నిరపాయముగ నామె స్వగృహమున కనిపెడి యేర్పాటు లొనరించినాఁడు. ఆమెను జంపఁ దలఁచినప్పు డాతని హృదయమున మెఱసిన మెఱుపే యాతనిని సంపూర్ణముగ మార్చివేసినది. ఆతఁ డొనరించిన క్రూరకృత్యముల నన్నిటిని దలఁచుకొని పశ్చాత్తాపము నొందినాఁడు. తనహృదయము లోని కాఠిన్యము, క్రౌర్యము,

మొదలగున వన్నియుఁ గరఁగి పోయినవి. కనులనుండి జోట జోట బాష్పములు కాఱినవి. దయార్ద్రాంతరంగుఁడై ప్రపంచ మందలి సర్వసృష్టిని బ్రేమించినాఁడు. దొంగల నాయకుఁడు క్రొత్త జీవనముఁ దాల్చి తనపాపము బ్రద్దలు జేసికొనుటకై భగవంతు నారాధించుట కొకచెట్టుక్రిందఁ గూలఁబడినాఁడు.

ఎన్నో యుగములు కడచిపోయినవి. జోడించిన చేతు లట్లేయున్నవి. తలయంతయు జడలుకట్టినది. శరీరమందంతటఁ బుట్టలు పెట్టినవి. తన్నుదానే మఱచిపోయినాఁడు దొంగల నాయఁకుఁడు వాల్మీకి యయినాఁడు.

కొంతకాలమున కీశ్వరుఁడు ప్రత్యక్షమై పశ్చాత్తప్తుఁడగు నా వాల్మీకిమహర్షి పాపములను క్షమించినాఁడు. "శ్రీమన్నారాయణ సంకీర్తనమునం దనవరతముఁ దనమన సుండున ట్లనుగ్రహింపు" మని వాల్మీకి కోరికొనినాఁడు.

హిమాలయ సదృశములైన యున్నతభావములు వాల్మీకివి. అతని హృదయమునుండి వెలువడిన గంగాప్రవాహము యుగయుగాంతముల వఱకుఁ బ్రవహించు చున్నది. ఆమధురగానము దిక్కుల నతిశయిల్లినది.

జీన్ వాల్జీన్-మతగురువు

౧

జీన్ వాల్జీన్ చాలఁ బొడవరి. మిగుల బలిష్ఠుఁడు. పెండ్లి కానివాఁడు. బీదస్థితియందున్నవాఁడు. విద్యావిహీనుఁడు. కూలివలన జీవించువాఁడు. ఆతని కొక వితంతుసోదరి కలదు. ఆమె కేడ్దఱుకొమార్తలుండిరి. ఆమెబిడ్డలతో నన్నగారి నాశ్రయించుకొనియుండి జీవనముఁ గడపుచుండెను. జీన్ వాల్జీన్ తాను కూలిపనిఁ జేసి తెచ్చిన పైకమును సోదరి కిచ్చుచుండును. అమె భోజనము వండి యన్నగారికిని, దనబిడ్డలకును బెట్టి పిమ్మటఁ దాను దినుచుండును. జీన్ వాల్జీన్ తనమేన కోడండ్రను గన్నకూఁతులవలె నెక్కుడుదయతోఁ జూచుచుండెను. ఆతఁడు ప్రతిదిన మింటికిఁ బోవునపు డెద్దియేని ఫలాహారముఁ గొనిపోయి వారల కిచ్చుచుండును. ఆతఁడు తనచెల్లెలిని, బిడ్డలను బోషించుటకై యెట్టికష్టతరమగుపనుల నైనఁ జేయుచుండును. ఒక్కొక దినమున నెక్కుడు పని దొరకకున్నచోఁ గానాఁటికూలి తమవలువురభుక్తికి సరిపోదనియెంచి చీఁకటిపడునంతవఱకు గ్రామమం దంతటను దిరిగి తిరిగి మరలఁ గొంత కూలి సంపాదించుచుండెడివాఁడు. ఇట్లు దినములు గడచిపోవుచుండెను.

ఆతనికి దురదృష్టదినములు వచ్చినవి. ఒకనాఁటి యుదయముననే యాతఁడు దూరిలోనికిఁ బోయినాఁడు. పనికొఱకై

పలుచోటులఁ దిరిగినాఁడు. సాయంకాలమైనను నాఁ డాతని కెవ్వరు నెట్టిపనియుఁ జెప్పియుండ రైరి. ఆదిన మంతయుఁ గాలితోఁ బెద్దవర్షముగూడఁ గురిసినది. ఆతని కేమిసేయుట కును దోఁచినది కాదు. అతఁడు తన కొఱకు దినమునఁ గాదు నాలుగుదినము లన్నము లేకపోయినను సహించుకొనఁగలఁడు. కాని నోరెఱుఁగని చిన్నిపాప లొకనాఁడు భోజనము లేకయుం డుట కాతని కంఠమునఁ బ్రాణవాయువు లున్నంతవఱకు కిష్ట పడఁడు.

అప్పుడే ప్రొద్దు గ్రుంకినది. ఆతని కొకకానియైన లభిం పలేదు. ఆతనికి సోదరియు బిడ్డలును జ్ఞప్తికి వచ్చిరి. "నా సహోదరి నారాకకై నిరీక్షించుచు మిక్కిలి చింతించు చుండును. చిఱుతిండి కలవాటుపడిన చిన్నిపాపలు నాకొఱకై యెంతబరితపించుచుందురోగదా? ఆఁకటిచే వారలకడుపు లెంత మండిపోవు చుండనోగదా?" అని యీవిధముగ మనమునఁ దలపోయుచుఁ బిచ్చియెత్తినవానివలె గ్రామమం దంతటను మరలమరలఁ దిరుగుచుండెను. వర్ష మింకను బోరుమని కురి యుచునే యున్నందునఁ దన గుడిసె యీసరికి భూమిపైఁ గూలియుండు నేమోయను భయ మాతనికి మిక్కుటముగ జనించినది. ధనముమీఁదను ధనవంతులమీఁదను నాతని కెంతయో కోప ముదయించినది.

ఆతఁ డొకయెడ నొకరొట్టెల దుకాణమును గాంచెను. ఆరొట్టెలు తినబిడ్డలయాఁకలి యొక్క త్రుటిలోఁ బోఁగొట్టఁగల వని యాతఁడు తలఁచెను. కాని యవి తనకు లభించు టెట్లు? కొనుటకుఁ దనయొద్ద నొక్కపైసయైన లేదు. తనదుస్థితియంతయు దుకాణదారునితోఁ జెప్పి రెండురొట్టె లడిగి తీసికొనిపోవుద " మని యుద్దేశించెను. కాని, యడిగినచో నాతఁ డొసఁగఁడేమో, యడుగకుండఁ గొనిపోవుటయే మంచిదని యూహించెను. కొంచెము ముందరి కరిగి 'చెప్పకుండ దొంగిలించు కొనిపోవుట తప్పుగాదా?' అని మరల యోజించెను. కాని నేనును, నా సహోదరియుఁ బిడ్డలును నాఁకటిబాధచే దేవుఁడాయని యేడ్చుచుండ నేనిది యెట్లయినఁ గొనిపోవుటలోఁ దప్పేమున్నది. అని తుదకు నిశ్చయించు కొనినాఁడు.

దుకాణమును సమీపించి యరుగుమెట్లపై కాతఁ డెక్కినాఁడు. అద్దపుఁ దలుపులగుండ లోనికిఁ జూచినాఁడు. ఎవ్వరును గాన్పింపలేదు. తనబలిష్ఠములగు బాహువులను దొందరగ ముందునకుఁ జాఁపినాఁడు. ఆతని బాహువేగమున కాయద్దము పగిలిపోయినది. పెద్దధ్వని యైనది. ఆధ్వనికిఁ జాటున నిదురించు దుకాణదారునికి మెలఁకువ కలిగినది. వాఁడనే యతఁడీవలకుఁ బరుగెత్తుకొనివచ్చి "దొంగ దొంగ పట్టుకొనుఁడు పట్టుకొనుఁ" డని కేకలు వైచినాఁడు. అచ్చటిపారాదారులు బరుగెత్తుకొనివచ్చి జీన్వాల్జీనును బట్టుకొనిరి. న్యాయాలయమందు న్యా

లాతనిచుట్టును జుట్టుకొనిరి. పోలీసుభటులు వెంటనే వచ్చి యాతనిఁ బట్టుకొని కారాగృహమునకుఁ దీసికొని పోయిరి. ఆరాత్రియంతయుఁ దనబిడ్డ లాఁకటిబాధచే నెంతగల్లడిల్లుచుండిరో యని యాతఁ డింతింత యనరాని దుఃఖమొందెను. మఱునాఁడుదయమున న్యాయాధికారి యొద్దకుఁ దీసికొని పోవుటకు భటు లాతని గొట్టునుండి బైటికిఁ దీసి న్యాయస్థానమునకు నడిపించుచుండిరి. జీన్‌వాల్జీన్ మనస్సులో నేదో యాలోచన పుట్టినది. తనచేతిని బట్టుకొనిన భటు నొక్కని నొక దెబ్బ గొట్టి విడిపించుకొని తొందరగఁ దన యింటివైపునకుఁ బరుగెత్త సాగినాఁడు. తోడనే రెండవభటుఁ డీల వైచినాఁడు. పలువురు భటులు పరుగుపరుగున వచ్చి యాతనిఁ బట్టుకొని గట్టిగ బంధించి చేతి కరదండలఁ దగిల్చి న్యాయస్థానమునకుఁ గొనిపోయిరి. ఇప్పుడు నేరముపై నేరము వచ్చినది. రెండవనేరము మిక్కిలి పెద్దదైపోయినది.

న్యాయాధిపతి యానద్వృత్తాంతము విచారణ చేసి "నీరెండునేరముల కేమిజవాబిచ్చెద" వని యడిగెను. ఆఁకటిబాధ సహింపలేక మా కాపూటకు సరిపడు రెండురొట్టెలను మాత్రము దీసికొంటిని. నాప్రాణసమానలగు మేనకోడండ్రను జూడనేఁగుచు మనసీ యభిలాషచే నన్నుఁ బట్టుకొనియున్న భటునిఁ గొట్టితిని. అంతలో న న్నందఱు వచ్చి పట్టుకొని బం

ధించిరి. ఏమిచేసినను మీచిత్త" మని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

న్యాయాధిపతి యాతని కైదుసంవత్సరములు కఠినశిక్ష విధించెను. భటు లాతని కారాగారమునకుఁ గొనిపోయి యచ్చటఁ గారాగృహమం దుంచి వానిచే మిక్కిలి కఠినము లగుపనులఁ జేయించుచుండిరి.

నాలుగుసంవత్సరముల పదునొకండు మాసములయిరువది దినములు కడచినవి. జీన్‌వాల్జీని కింకఁ బదిదినము లోపిక పట్టినచో విడుదల కాఁగలదు. కాని పదిదినములుఁ బదియుగములవలె నాతఁడు భావించెను. ఆనాఁటి సాయంకాలము భటు లెప్పటివలె జీన్‌వాల్జీనునకుఁ దిండి పెట్టి తిరిగి యాతని గొట్టులోఁ బెట్టి యెప్పటివలెఁ దాళము వైచి యీవలఁ గావలి యుండిరి.

రాత్రి పండ్రెండుగంటల వేళ యైనది. భటులు మైమఱచి నిదురపోవుచుండిరి. జీన్‌వాల్జీను కారాగృహపు టినుపతలుపులను బట్టుకొని నిలుచఁబడి పరధ్యానముగఁ గొంతసే పీవలకు దృష్టిఁ బఱపెను. తోడనే గిఱ్ఱున లోనికిఁ బోయి చాఁపపై వెలికిలఁ బరుండెను. ఊహాకాశమునఁ దలఁపు లొకదాని వెనుక నొకటి నీలమేఘములవలెఁ బరుగెత్తినవి. దీర్ఘాలోచన

చే నాతని తలయంతయు బరువై పోయినది. ఇఁకనొక నిమిష మైన నా కారఁనుం దుండుట కాతనికి దుర్భరముగఁ దోఁచెను. తన సహోదరియుఁ, బిడ్డలును దనయెదుట నిలువఁబడి తన్నా వలకు రమ్మని సంజ్ఞఁ జేసిన ట్లాతఁడు భ్రమఁ జెందెను. లేచి నిలువఁబడి యేమి చేయుటకును దోఁచక యున్మత్తునివలె నా చీఁకటిగదిలో నటునిటుఁ దిరుగాడఁ జొచ్చెను.

అందఱును గాఢముగ నిదురఁ బోవుచున్నారు. కారా గార మంతయును నిశ్శబ్దముగ నున్నది. ఇంతకాల మాతఁడు చెఱయం దున్నను నాతనిశరీరములోని బలముమాత్రి మిను మంతయుఁ దగ్గలేదు. ద్వారముదరికి వచ్చినాఁడు. ఇనుపనా ళసములను రెండుచేతులతోను బట్టుకొని తనబలము నంతయు వినియోగించి రెండునాసములను రెండువైపులకు వంచివేసి నాఁడు. మెల్లగ నా నారసముల మధ్యనుండి దూఱి యీవల కరుదెంచి నలువంకలఁ బరికించి కాలికొలఁది పాఱిపోవ సాగి నాఁడు. అంతలోఁ గావలిభటుఁడు మేల్కాంచి యాతనిఁ బరి కించి బిగ్గరగఁ గేకలు వైచినాఁడు.

తోడనే తక్కినభటు లందఱును లేచి జీన్వాల్జీనువై పునకుఁ బరుగెత్తినారు. అతఁ డింకను జుట్టుగోడను దాఁటక మునుపే భటులందఱు నాతనిఁ జుట్టుకొని కొంతవడికిఁబట్టుకొని యాతని కాలుసేతులకు నినుపగొలుసులను దగిలించినారు.

మఱునాఁ డతనిని న్యాయస్థానమునకుఁ దీసికొని పోయిరి. విచారణ జరిగినది. తిరిగి యాతని కైదువత్సర

ములు కఠినశిక్ష విధింపఁబడెను. ఇదియుఁగాక నతఁడు కారాగారమున సరిగ నడచుకొనక పోయినందులకేమి, భటులను గొట్టినందులకేమి, యింకొక నాలుగు సంవత్సరముల శిక్షకుఁ గూడ మరలఁ బాత్రుఁ డయ్యెను. పాపమాతఁడీకఁ బది దినము లోపిక పట్టినచోఁ దనసోదరిని, బిడ్డలను జూచుకొని సంతోషముఁ బొందఁజాలి యుండునుగదా! పదిదినములు కన్నులుమూసికొని కడవఁజాలనివాఁ డీతఁ డొమ్మిది సంవత్సరములెట్లు గడపఁజాలునో?

తొలుదొల్త నాతఁ డంగలార్చుచును గొణఁగుచును, నిరంతర దుస్సహావాసముచేతను, నెవలెరుగని కష్టములచేత హృదయకార్కశ్యపూరితుఁ డగుటచేతను నాతని కౌష్ఠములు స్పృశించనయ్యెను.

ఎట్లో తొమ్మిది సంవత్సరము లాతఁడు కఠినశిక్ష ననుభవించినాఁడు.

“క్రూరుఁడగు జీన్‌వాల్జీన్ విడుదల నందుచున్నాఁడు. కావునఁ బ్రజలెల్లరు జాగరూకులై యుండుఁడు” అని పోలీసువారు చాటింపుఁ జేయించి యాతని ముఖముపై “గజదొంగ” యను నక్షరములు వ్రాఁతవేసి విడిచిపెట్టిరి.

౩

జీన్‌వాల్జీన్ ముక్తుఁడైనాఁడు. కారాగారమునుండి యాతఁడు వెలుపలి కరుదెంచుచున్న వార్త విని యాపట్టనము

లోని వ్రజ లెల్లరు వీధులలో రాకపోకలే మానుకొనిరి. ఆతనిఁ జూచినవారెల్లరుఁ దమతమ వీథిగుమ్మపుఁ దలుపులను మూసికొనఁ దొడఁగిరి. దినమంతయు నాతఁ డాగ్రామమునఁ దిరిగినను నాతని కొక్కమనుజుఁడైనఁ గానఁబడలేదు. ఆతని కాఁకలియు, డప్పికయును, విపరీతముగఁ గలుగుచుండెను.

తుదకు రాత్రియగుసరి కొకయింటి గుమ్మముదరి కాతఁ డేతెంచినాఁడు. ఆయింటి తలుపులు తెఱవఁబడియే యున్నవి. "దాహము మిక్కిలి బాధించుచున్నది. కొంచెము మంచి నీ రిచ్చి పుణ్యముఁ గట్టుకొనరా!" యని యాతఁ డఱచెను. లోపలినుండి యెవ్వరో యొకచిన్న దీపమును గొనివచ్చి యాగుడ్డివెలుతురులో నాతని మొగముపైఁ గాల్పఁబడి యున్న యక్షరములఁ జూచి "అమ్మో!" యని యఱచి లోనికిఁ బరుగెత్తిరి. ఇంకొక రావెంటనే వచ్చి తలుపులను మూసివైచిరి. ఇక్లేజిన్‌వాల్జీనును బ్రజ లెల్లరు బహిష్క రించిరి.

ఆతఁడు మఱికొంతసేపటి కింకొక యింటిదగ్గఱ కేఁగి నాఁడు. ఆయింటితలుపులన్నియుఁ దెఱువఁబడియే యున్నవి. లోపల దీపము వెలుఁగుచున్నది. ద్వారముచెంతకుఁ బోయి "అమ్మా! అమ్మా!" యని మెల్లగఁ బిలిచినాఁడు. లోప లినుండి యొక మగవాఁ డీవలకు వచ్చినాఁడు. దీనవదనముతో నిలువఁబడియున్న జీన్‌వాల్జీనును జూచి రెండుచేతులను జాఁచి

"నాయనా ! నీకొఱకే నేనింతవఱకు వేచియున్నాను. దయా మయుఁడైన పరమేశ్వరుఁడు నీబోఁటి పాపాత్ములకొఱకై వేచియుండుమని నా కానతిచ్చినాఁ" డని చెప్పుచు నాతనిఁ గౌఁగిలించుకొని లోనికిఁ దీసికొనిపోయినాఁడు.

ఆతఁ డొకమతగురువు. తనసేవకులను బిలిచి యాతనికి ముందుగఁ బానీయ మిప్పించినాఁడు. పిమ్మట స్నానముఁ జేయించి కట్టుకొనుటకు మంచివస్త్రముల నిచ్చినాఁడు. అటు పిమ్మట ననేకభక్ష్యభోజ్యములతో నాతనికి భోజన మిడినాఁడు. భోజనానంతరము పండుకొనుట కొకమెత్తని పఱుపు నిచ్చినాఁడు. జీన్‌వాల్జీనునకుఁ గలిగిన సంతోషమునకు మేర లేదు. తెల్లని మెత్తని యాశయ్యపైఁ బండుకొనినాఁడు. పాపము పగలంతయుఁ దిరిగితిరిగి యలసిపోవుటచే నాతని కా వెంటనే నిద్ర పట్టినది.

ఆయిల్లెల్ల నిశ్శబ్దముగ నున్నది. తెల్లవాఱ వచ్చుచున్నది. జీన్‌వాల్జీను మేల్కాంచినాఁడు. కడచినదిన చర్యయంతయు జ్ఞప్తికి వచ్చినది. జీవిత మంతయు నిట్లే యున్నచో నీక ష్టమునకు మెట్లని యాతఁడు తలఁచెను. ఆతనికిఁ దన సోదరియు, బిడ్డలును, జ్ఞప్తికి వచ్చిరి. వెంటనే స్వగ్రామమునకేఁగ నిశ్చయించుకొనెను.

"ఇంతకాలము నేను వారలకు దూరమై పోయితిని. ఇప్పుడు వారల కేమి తీసికొని పోవుదును ? ఇట్టిస్థితిలో నున్న

నే నేమిసంపాదింపఁ గలను?” అని యాలోచించుకొను చుండెను. తనకెదురుగనున్న బీరువాయందు రెండు వెండి చెంబు లాతని కగపడినవి. వానినిఁ జూచికొని సంతసించెను. తా నదివఱకు భోజనముఁ జేసినగదిలో రెండు వెండిగిన్నెలు గలవు. వానినిఁగూడఁ గొనిపోవుట కాతఁ డూహించెను. తత్క్షణమే లేచినాఁడు. బీరువాతలుపులు తెఱచియే యున్నవి. రెండు వెండిచెంబులను, రెండుగిన్నెలను, దీసికొని మెల్లగ వీథిగుమ్మమునఁ జొచ్చి బైటికిఁ బోయినాఁడు.

ఇంతకంటె ఘోరమైన దోషము మున్నదా? లోకమంతయుఁ దన్ను బహిష్కరించి భయముతోఁ దిరస్కరించుచుండఁ జూచినప్పుడు దయతోఁ దన్నాదరించి యన్నపానీయము లొసఁగిన యా మతగురువు నెడలఁ దా నెంతటి కృతఘ్నతను జూపినాఁడు!

౮

తెల్లవాఱినది. జీన్ వాల్జీ నొక మైదానము వెంబడి స్వగ్రామాభిముఖుఁడై పోవుచున్నాఁడు. వెండిగిన్నెలు పై కగపడకుండ బాహువులసందున నిఱికించుకొని శరీరముపై నొక బట్టఁ గప్పుకొనియుండెను. కొంతదూరము పోయిన పిమ్మటఁ గొందఱు పోలీసుభటు లాతని కెదురుపడిరి. చింపిరి చిటు లగుటచే నతనిని బలుకరించి యాతని గమ్యస్థానాది

కనులను బ్రిక్కించిరి. జేకవాల్జీను వారలను గాంచి కొంచెము తొట్రుపాటుఁ జెందెను. ఎవరో యాతనిచంకలో దాఁచి నాఁడని గ్రహించి పోలీసుభటు లాతనిచేయిపట్టుకొని గట్టిగ లాగిరి. వెండిగిన్నెలు క్రిందఁ బడినవి. వీని నెచ్చట దొంగి లించితి వని వా రాతని బంధించి మిక్కిలి బాధించిరి. ఆగిన్నె లపై మతగురువు పేరున్నది. ఆ మతగురువు తనకవి బహు మతి నొసఁగెనని జీన్ వాల్జీన్ పలికెను. "అటులైన నిన్నా తనియొద్దకుఁ దీసికొనపోయెదము; రమ్ము"ని బలవంతముగ నాతని నీడ్చుకొని పోవఁదొడఁగిరి.

జేకవాల్జీనునకుఁ గాళ్ళాడవికావు. అధైర్యమువలన నాతనిశరీరములోని బలమంతయు నశించినది. మొగమున నెక్కడను రక్తపుఁజుక్క లేదు. హృదయ మల్లకల్లోల మైనది.

తన కింక నీజన్మమందున సోదరిని, బిడ్డలను జూచుభా గ్యము లేదనుకొన్నాఁడు. ప్రపంచము మీఁదియాసయే యాతనికి నశించినది. "అకటా! నే నింక మతగురువు నేమొ గము పెట్టుకొని చూడఁగలుగుదును? అంతటి యుపకారముఁ గావించిన తన కిట్టి యపకార మొనరించిన దుష్టులకు నాదొంగిలి చర్య వెలిపించుటకుగాని నన్నాతఁడు క్షమించునా? నా కింక శాశ్వతముగఁ గారాగృహవాసము తటస్థించు నేమో?" యని యాలోచించుకొనుచు నడచెను.

కొంతవడికి వారు మతగురుని యింటిసమీపమునకు వచ్చిరి. గుమ్మమున కెదురుగఁ బోలీసుభటులు జీన్ వాల్జీనును నిలువఁ బెట్టిరి. లోనుండి మతగురువు వారినిఁ జూచెను. జీన్ వాల్జీను కన్నులను మూసికొని యుండెను. మతగురువు పోలీసుభటుల చేతిలోని వెండిగిన్నెలను గాంచి యంతయు గ్రహించెను.

అతఁ డీవల కరుదెంచి "నాయనలారా! మీ రాతని నెందులకు బంధించితిరి. నాయింటిలోని వస్తువుల నన్నిఁటిని దీసి కొనిపొమ్మని నే నాతనిఁ బ్రార్థించితినే. అతఁడు వాని నన్నిఁటిని గొనిపోఁజాలక యీ నాల్గింటినే కొనిపోయినాఁడు. అతఁడు నిర్దోషుఁడుకావున వెంటనే విడిచిపెట్టుఁ" డనిపలికెను.

భటు లేమిచేయుటకును వీలులేక తత్క్షణమే యాతని విడిచిపెట్టి వెడలిపోయిరి.

జీన్ వాల్జీను కన్నులను మూసికొనియే తలవంచి నిలువఁ బడియుండెను. మతగురు విట్లు వచించునని యాతఁ డించుకయు భావించి యుండలేదు. మతగురువువాక్యములు శూలసదృశ ములై యాతని మనసునకు నాటినవి. ఆతనిహృదయమంతయుఁ బరితాపముచేఁ గాలిపోయెను. బ్రదికియుండియే మహానరక బాధ ననుభవించినాఁడు. సంపూర్ణముగఁ బశ్చాత్తాప మొంది నాఁడు. నేలపై సాష్టాంగపడి "పరమేశ్వరా! చెప్పరాని తప్పిదము లెన్నియో యొనరించితిని. నాకంటెఁ బాపాత్ముఁ

డింకొకఁడు లేఁడు. నాపాపములనెల్ల క్షమించి నన్నుఁ జేపట్టు" మని ప్రార్థించెను.

పిమ్మట జేకౌవాల్డీస్ మతగురువుకాళ్లపైఁబడి "దయామయా! నే నొనరించిన యీమహాపరాధమును బరిపూర్ణానుగ్రహమున క్షమించి రక్షింప వేఁడుకొనుచుంటి" నని వెక్కి వెక్కి యేడువఁదొడఁగెను. మతగురు వాతఁడు పశ్చాత్తప్తుఁడై చింతించుచున్నందుల కాతనితప్పిదమును క్షమించి నాఁటినుండియు నతనిఁ దనశిష్యకోటిలోఁ జేర్చికొని మిక్కిలిప్రేమతోఁ గాపాడినాఁడు.

అశోకుఁడు—యుద్ధభూమి

౧

నందవంశము సంతతము సమూలముగ నాశన మొనర్చి చంద్రగుప్తుఁడు మగధసామ్రాజ్యము సంపాదించెను. పాటలీపుత్ర మాతని రాజధాని. ఆతని కుమారుఁడు బిందుసారుఁడు నర్మదాకృష్ణాస్రవంతులమధ్యమునున్న రాజ్యములోని రాజవీరులనందఱను జయించి రాజ్యసంపాదన మొనరించుటయేకాక "అమిత్రఘాతుకుఁ" డను పౌరుషనామమునుగూడఁ బడసెను.

అట్టివిజిగీషువులవంశములో నా బిందుసారునికడుపున నశోకవర్ధనుఁడు జన్మించెను. బిందుసారుఁ డీతనిఁదక్షశిల, యుజ్జయిని మొదలగు ప్రదేశములకుఁ బ్రతినిధిగా రాజ్యము చేయఁ బంపెను.

అశోకుఁడు యువరాజు. వినోదములయం దత్యంత కుతూహలము కలవాఁడు. తనవినోదములఁదీర్చుకొనినతరువాత నేయెట్టిరాజకార్యములైనఁ జూచుకొనెడివాఁడు. నిరంతరము మాంసాదికాహారములచే బలిసి యుండు కోళ్ళ గొఱ్ఱెపొట్టేళ్ళ పందెములతోను, నేనుఁగులపందెములతోను గాలక్షేపము చేయుచుండెడివాఁడు. పాపము, నోరులేని యుభయప్రాణులను డీకొల్పి యవి తలలుపగిలి, నెత్తురులు గ్రక్కుచుఁ గూలఁబడుచుండ నాతని కానంద మెట్లుప్పొంగునో గదా! అతఁ డెక్క-

వేటకుఁ బోయినను చామరధారిణులగు యవనయువతులు వెంబడించివత్తురు. పేరికిమాత్ర మశోకుఁడు తక్షశిలను బాలించుచుండెను, కాని నిజమైన బాధ్యతయంతయు మహారాజగు బిందుసారునిదే.

వినోదఖేలనములలో నెంతనిమగ్నుఁ డయ్యును తనమనమున నశోకునకు సామ్రాజ్యతృష్ణ విపరీతముగ నుండెను. ఎట్లైనను దనయన్నదమ్ములను గాదని తానే సింహాసనమధిష్ఠింప లోలోపల నువ్విళులూరుచుండెను. యువరాజుగానున్నప్పుడే కొంతవఱకు, నంతకుమున్ను తనతండ్రియొద్దనున్నప్పుడే కొంతవఱకు మొత్తముమీద రాజ్యపరిపాలనాక్రమ మెల్ల నర్థము చేసికొనెను.

ఇట్లుండఁగా నిరువదియైదుసంవత్సరములు రాజ్యముచేసి వృద్ధుఁ డగు బిందుసారుఁడు పరలోకగతుఁ డయ్యెను. అతని కెందఱో భార్యలు కలరు. వారియందఱవలన నాతనికిఁ దొంబదియెనమండ్రు కుమారులు కలిగిరి. వారిలో గొందఱు బలవంతులు, కొందఱు చాల మంచిహృదయములుకలవారునైయుండిరి. రాజ్యసంపాదనమేముఖ్యోద్దేశముగాఁగల యశోకుఁడు సింహాసనము నాక్రమించుకొనుట కెట్టికార్యముఁ జేయుటకైన శంకింపఁడు. అశోకుఁడు రాజగుటకు గొందఱనుమతింపక యెన్నియో యాటంకములఁ గల్పించిరి. నిజమునకు నశోకునకంటె ముందుగా సింహాసన మధిష్ఠించుట కర్హులగు జ్యేష్ఠులు

కలరు. రాజ్యాసక్తిచే నశోకుఁడు వారి నెల్లరఁ బట్టించి వివిధ రీతులఁ జిత్రవధముఁ గావించెను.

నిర్దోషులును, నాతనియందు సదభిప్రాయము కలవారును కూడ నెందఱో యాతని క్రోధానలమునఁ బడి మ్రగ్గిపోయిరి. రాజ్యసంపాదనపరత్వము తన సహోదరులయెడఁ గనఁబఱుప వలసిన సుహృద్భావమును కూడ నశింపఁ జేసినది. దయాదాక్షిణ్యములకుఁ దావీయక మహాక్రౌర్యమునఁ దనసోదరుల రక్తముచే దడిసివైచినమగధరాజ్యమున నెన్నియుద్ధంబులుకలిగినను వాని నన్నిఁటి నాతని నిశితాసిచేఁ జెండాడి పాటలీపుత్రమున సింహాసనాసీనుఁడై యశోకుఁడే పట్టాభిషిక్తుఁ డయ్యెను.

అప్పటి కాతనికి హిమవత్పర్వతములకును మైసూరు దేశమునకును మధ్యమునుండి ప్రాక్పశ్చిమసముద్రముల నంటుచున్న విశాలమైన రాజ్యముండెను. రాజ్యములోని యంతఃకలహము లన్నియుఁ దీఱిపోయినవి. సామంతరాజు లెల్లరుఁ దనకు లోఁబడి కప్పములను జెల్లించుచునే యుండిరి. కాని యశోకుఁడు తన తండ్రితాతలవలెనే దిగ్విజయయాత్రకు బయలుదేఱ నూహించెను.

౨

ఆకాలమునఁ గళింగరాజ్యము సకలవైభవముల నలరారుచుండెను. మహానదీగోదావరీనదులమధ్యభాగమే యప్పటి కళింగరాష్ట్రము. అశోకుని కన్ను లారాజ్యముపైఁ బడినవి.

తమకు సామంతులుగా నుండవలసిన కళింగరాజులు స్వాతం త్ర్యమునకుఁ బ్రయత్నించుట తన కవమానహేతు వని తలఁచి దిగ్విజయమునకై గొప్పసైన్యమునుదీసికొని బయలువెడలెను. చతురంగబలసమేతమయిన యీ సేన పదునొకండువత్సరము లెడతెఱపిలేక మిక్కిలిజాగ్రత్తతోఁ దరిబీయతు గావింపఁ బడినది. ఈ పదునొకండువత్సరములును యుద్ధభూమి కరుదేరక సైన్య మంతయు మదించియుండెను. "యుద్ధ మెప్పు డెప్పు" డనసైనికు లందఱు మిక్కిలి తొందరపడిరి.

మహాటోపమున మిన్నుము న్నదరిపోవున ట్లరుదెంచు మగధసైన్యములఁ గూర్చి చారులవలనఁ దెలిసికొని తమ వాహిని ననేకవిధముల బలపఱచి యెట్లైనఁ దనరాజ్యమును, స్వాతంత్ర్యమును నిలుపుకొన మంచిపట్టుదలతో నెదురుకొను టకు వలసినసన్నాహ మంతయుఁ గళింగాధిపతి యతిత్వరిత ముగఁ జేయించెను. ఉభయవాహినులును రణరంగమునందుఁ దారసిల్లినవి. కళింగసైన్యముకంటె మగధసైన్యము రెట్టింపు గలదు. ఎంతటిరక్తపాతమునైనఁ గావించి యీరాజ్యము నతిఁడు గెలుచుకొను నని యశోకుఁడు చాటింపించెను. మహోత్సాహముతో రెండుపక్షములనుండియు గుండె లదరి పోవునట్లు భేరీభాంకారములు వినవచ్చుచున్నవి.

యుద్ధము జరుగు చున్నది. స్వాతంత్ర్యమునకై తుది రక్తపుఁ జుక్కవఱకును వెనుదీయక సమరముసేయు కళింగ

సైనికులతోఁబదునొకండువర్షములనుండి యుద్ధమేలేక యొడలు క్రొవ్విన మగధసైనికులు తలపడిరి. పెట్టనిగోడలవలె నేనుఁగులు సైనికుల నడ్డుచున్నవి. సముద్రతరంగములవలె గుఱ్ఱములు విజృంభించుచున్నవి. కత్తులతోఁ, గటారులతో నొండొరులఁ బొడుచుకొనుచుఁ జెండాడుచు భటులు చంపుకొనుచుండిరి. ప్రతిదినము లెక్కకుమీఱినసైనికులు చచ్చుచున్నారు. హతశేషులు ముందునకువచ్చి మఱింతధైర్యముతోఁ బోరుచు నుత్సాహముతో వీరస్వర్గము నలంకరించుచున్నారు. రణరంగమంతయు మరణరంగ మయ్యెను. ఎక్కడఁజూచినను క్షతగాత్రులే. ఎచ్చటఁగనుఁగొన్నను రక్తపుఁగాల్వలే. తలవంపక వీరనికాయము మృతకళేబరములను ద్రొక్కుకొనుచుఁ బోయి తనుశత్రువులతో యుద్ధముచేయుచుండిరి. ఒక్కొకచోఁ దమ బల్లెపుఁగొనలచే మృతకళేబరములను బ్రక్కకు దొరలించి ముందునకు బోవుచుండిరి. బలమైనగాయములు తగిలియుఁ దమ కు య్యాలించువారులేక “దాహమో” యనివేమాఱచి తుదకుఁ గొందఱు చనిపోవుచుండిరి.

సుమారులక్షసైనికు లుభయసైన్యములలోను జచ్చిరి. వేలకొలఁది యశ్వములును వందలకొలఁదియేనుఁగులును మడిసినవి. ఏపక్షముకూడ నింతవఱకు గెలిచినట్లు కాన్పింపదు. మహారాజగు నశోకవర్ధనుఁడుకూడ స్వయముగా రణరంగమునకే తెంచి మిక్కిలిజవసత్త్వములుగల నశ్వరాజ మొక

దానిపై నెక్కి తనచేతికందినవారి నెందఱనో నిశితకరవాలమున వధ్యులుచేయుచునే యున్నాఁడు. రాజున కిదియే మొదటి యుద్ధము. సమర మొనరించుట యనఁగ నెదిరిరాజులను లోఁగఁ దీసికొని వారిరాజ్యమును దాను బొందుటయేయని యాతఁడు తలఁచెను. కాని కార్యసాధనమునం దెంతటిరక్తపాతమగునో, యెన్నిహింసాకృత్యములు జరుగునో, యేమియు నెఱుఁగని సాధుజనములు క్షామాదికములవలన నెంతగాఁ బీడింపఁ బడుదురో యాతఁ డూహింపలేదు.

పోరటులనే జరుగుచున్నది. తమయసమానమైనబాహుపరాక్రమమును, యుద్ధనైపుణ్యమును, గనఁబఱుపవలసినయదనదియే యని సైనికులను హెచ్చరించుట కశోకుఁడు తనసేనానాయకున కుత్తరువొసఁగెను. సమరము తెఱఁగతిబీభత్సముగ మాఱిపోయెను. కళింగసైన్య మొంతటిపట్టుదలతోఁ బోరినను నసంఖ్యాకమయిన మహారాజుసైన్యము నెదిర్చి జయింపలేక పోయినది. అశోకచక్రవర్తి యుద్ధమునఁ గళింగరాజ్యమును జయించెను.

3

హతశేషులైన కళింగసైనికులను బట్టుకొని బద్ధులఁ జేయుటకు మగధసేనానికి నాజ్ఞయైనది. భేరీనినాదము లాఁగి పోయినవి. సైనికులయార్భటములు సమాప్తిఁజెందెను. అశో

కుఁడు మెల్లఁగ యుద్ధభూమినుండి బయలుదేఱెను. చూచువా గల కారణరంగము మిగుల బీభత్సముగ నుండెను. తలలు లేని మొండెములు, తెగిన చేతులు, విఱిగిపోయిన కాళ్లు మిగుల విరియఁజిమ్మినట్లు పడియుండెను. నెత్తురు కేఱులై ప్రవహించుచుండెను. కరుడుగట్టి నల్లపడిన కొన్ని మాంసఖండములు, సంతకుమున్నే తెగిన మొండెములనుండి స్రవించు నెత్తురు చూచువారలకు మిక్కిలిభీతిఁ గొల్పుచుండెను. కాకులు గ్రద్దలు మానవశరీరములఁ బొడుచుకొని తినుచుండెను.

అచ్చటచ్చటఁ బెద్దపెద్దగాయములుతగిలియుఁ, గాళ్ళు తెగియుఁ, జేతులు వ్రేయఁబడియుఁ జావక కొనయూపిరితో నున్న కొందఱు సైనికులు “ అయ్యో, అబ్బా ! దాహము ! బాధ, దుర్భరము ” అను నీరసధ్వను లశోకుని నాకర్షించినవి. “ అయ్యో ! దాహము, దాహము, దుర్భరము, బాధ ” యనుచుఁ గేకలిడుచు నఱుకఁబడిన పాదములపై నిలుచుటకుఁ బ్రయత్నించి మరల నేలపైఁ గూలి ప్రక్కనున్న కళేబరమునుండి స్రవించు రక్తమును ద్రావుచున్న క్షతగాత్రు నొక్కని నశోకుఁడు కన్నులారఁ గాంచెను. ఆతని హృదయమున నప్పుడు తటుకున నొక్క మెఱపు మెఱసెను. గడగడ వణఁకినాఁడు. కుళ్ళికిపోయినశవములన్ని లశోకునకు భయమును గలిగించినవి. ప్రేగులు బయల్వెడియున్న కొన్నిశరీరము లశోకునిహృదయమును లోఁ గొన్నవి. భయముచే నాతఁడు కను

లట్లు మూసికొనినాఁడు. మృతులైన సైనికుల బంధుగులు కంటికిమంటికి నేకధారగ విలపించుచున్న ట్లాతనికిఁ దోఁచెను. భోజనము లేక కఱవువలన నెన్నియో కుటుంబములు మలమల మాఁడిపోవుచున్న ట్లాతని యూహాపథమున గోచరించెను.

అతఁడు స్తంభీభూతుఁడై పోయినాఁడు. ఇంతటి ఘోర కృత్య మొనరించి యింతమంది ప్రజల నేడ్పించి రాజ్యముసంపాదించుటకంటె వేఱొండు పాపము లేదని యాతఁడు గ్రహించెను. చేతియందలికత్తిని జాఱవిడిచినాఁడు. యుద్ధభూమిలో మోఁకఱిల్లి యున్నప్రాణులు తనవలన నశించినవిగదా యను విచారమున నశ్రువులు రాల్చినాఁడు. సంపూర్ణముగఁ బశ్చాత్తాపము నొంది గడియసే పచ్చటనే ప్రార్థనసల్పినాఁడు.

మగధసైన్యములు మరల పాటలీపుత్రమును జేరినవి. పాపనాశనమునకై యశోకుఁ డెన్నోపుణ్యకార్యములఁ జేసెను. పశులకును, జంతువులకును, మనుష్యులకును నెన్నో సౌకర్యముల నాతఁడు గావించెను. "అహింసాపరమోధర్మః" అను సిద్ధాంతమును బ్రబోధించిన బుద్ధభగవానుని యుపదేశమును శిరసావహించి దేశమంతయు నహింస నవలంబించునట్లు శాసించెను. కళింగయుద్ధ మశోకుని బశ్చాత్తప్తుని గావించినది. ఆ పశ్చాత్తాపమే యాతని బౌద్ధభిక్షుని గావించి హైందవచక్రవర్తులలో నగ్రగణ్యునిగాఁ జేసినది.

పశ్చాత్తాపము పతితపావనము గదా!

శ్రీకృష్ణ ముద్రాక్షరశాల,
పిఠాపురము.
1935.